ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 26.0


ప్రహరీ లోపల చిన్నపాటి స్థలంలో ముదినేపల్లిలోని శ్మశానవాటిక

అన్వేషణ

- బడుగుల శ్మశానాలపై కసరత్తు
- ఎస్సీ, ఎస్టీలకు స్థలాల కోసం కార్యరంగంలోకి తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది
- అంచనాలు నివేదించాలంటూ సీసీఎల్ఏ ఆదేశాలు


(ఏలూరు-ఆంధ్రజ్యోతి)
బడుగు, బలహీన వర్గాలకు వేర్వేరుగా శ్మశాన వాటికలకు స్థలాలను సిద్ధం చేయాలంటూ ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి ఆదేశాలను జారీ చేసింది. దీంతో అధికారులు కార్యరంగంలోకి దిగి స్థలాల అన్వేషణకు కసరత్తులు ప్రారంభించారు. అగ్ర కులాల వారికి మాత్రమే జిల్లా వ్యాప్తంగా అధికశాతం శ్మశానవాటికలు ఉన్నాయి. కొన్నిచోట్ల విద్యుత్ యంత్రాలతో పార్థీవ దేహాలను దహనం చేసే ప్రక్రియకు ఏర్పాట్లు ఉన్నాయి. పల్లె,పట్టణం అనే తేడా లేకుండా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు శ్మశాన వాటికలంటూ ఏమీ లేకుండా పోయాయి. దీంతో ఊరికి చివరి పాడుబడిన స్థలాల్లోను ఖననం లేదా దహనాలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలం వస్తే మృతదేహాలను డొంకల్లో, వాగుల్లో తరలించడం కష్టసాధ్యమే. ఈ వర్గాలకు శ్మశానవాటికల ఏర్పాట్లుకు స్థలాలను అన్వేషించి, మండ లాల వారీగా నివేదికలు సమర్పించాలని రాష్ట్ర భూపరిపాలనా కమిషనర్ (సీసీఎల్ఏ) జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. దెందులూరు మండలాన్ని పరిశీలిస్తే 17 పంచాయతీల పరిధిలో ఒక్కో గ్రామంలో గతంలో ఎకరం, రెండెకరాల పరిధిలో అందరికి కలిపే శ్మశానవాటికలు ఉండేవి. వివిధ కులాలకు సంబంధించి సరిహద్దులుండేవి. చాలాచోట్ల ఆక్రమణలతో శ్మశానవాటికలు కుదించుకుపోయి బక్కచిక్కాయి. 25 నుంచి 10 సెంట్లకు మించి స్థలం అందుబాటులో లేకపోవడంతో గ్రామాల్లో సమస్యలు తలెత్తుతున్నాయి. దీనికి తోడు పంట పొలాల మధ్యలో ఉండే ప్రాంతాల్లో గట్టు కింద శ్మశానాల స్థలాలు కలిపేసుకున్న ఘటనలున్నాయి. ఏలూరు శనివారపుపేట పరిధిలో తమ్మిలేరులో దహనాలు, ఖననాలు జరుగుతుండేవి. ఇక్కడ స్థలాలు కొరత ఉంది. ఏటిగట్టు నుంచి కిందకు దిగి వర్షాకాలంలో దహన ప్రక్రియలు చేస్తుంటారు.

ఉన్న వాటికి లెక్కాపత్రాల్లేవ్..

జిల్లా వ్యాప్తంగా పంచాయతీల్లో ఏయే వర్గాలకు ఎన్నెన్ని శ్మశాన వాటికలున్నాయనే అంశంపైన లెక్కల్లేవ్. మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో వీటి నిర్వహణ పక్కాగా జరుగుతోంది. వీటిపై తనిఖీల్లేవు. ఇదిలా ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో శ్మశాన వాటికల స్థలాల అన్వేషణలో పోరంబోకు, పుంత, ఇతర గయ్యాళి భూములను పరిశీలించాలని, కొన్నింటికి నిబంధనలు అడ్డొచ్చినా పేదల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకోవాలన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. స్థలాలు దొరకని పక్షంలో భూముల సేకరణకు ఎంతెంత వ్యయం అవుతుందో అంచనా వేసి నివేదించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్డీవోలు, తహసీల్దార్లు, కిందిస్థాయి సిబ్బంది పారదర్శకంగా అడుగులు వేస్తేనే శ్మశాన వాటికల స్థలాల సమస్య తీరనుంది.

నైరుతి..!


చాటపర్రులో వర్షాలు లేక నెర్రలు తీసిన నారుమడి



ఈ ఏడాది మందగించిన వర్షాలు

- జూన్‌లో నాలుగు, జూలైలో 24 మండలాల్లో మైనస్ వర్షపాతం
- ప్రశ్నార్థకంగా సార్వా సాగు .. రైతుల్లో ఆందోళన

వర్షాకాలం మొదలైందంటే నైరుతి రుతుపవ నాలు ఆగమనంతో జిల్లాలో వర్షాలు జోరుగా కురవాలి. సాధారణం కన్నా ఎక్కువగానే వర్షా లు కురిస్తే సార్వా సాగు సజావుగా సాగు తుంది. అయితే ఈ సారి జూన్‌లో నైరుతి రుతుపవనాలు పర్వాలేదనిపించినా జిల్లాలోని నాలుగు మండలాల్లో మైనస్ వర్షపాతాలు నమోదు కాగా జూలైలో పూర్తిగా వర్షాలు మందగించడంతో 24 మండలాల్లో మైనస్ వర్షపాతాలు నమోదైంది. వర్షాభావ పరిస్థితుల్లో సార్వా సాగుపై నీలినీడలు అలముకున్నాయి.

ఏలూరుసిటీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సార్వా సీజన్ ఆరంభమైనా వర్షాలు మాత్రం ముఖం చాటేస్తున్నాయి. జూన్, జూలై రెండు నెలల్లో సరాసరి వర్షపాతాలు పరిశీలిస్తే జిల్లా లోని 28 ప్రాంతాల్లో 16 మండలాల్లో మైనస్ వర్షపాతాలు నమోదు కావడం గమనార్హం. ఇక ఆగస్టు నెల ప్రారంభమై నాలుగు రోజులు గడిచినా ఇప్పటివరకు వర్షాల జాడ లేదు. దీంతో సార్వా సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే సార్వా వరి సాగులో వరి నారుమళ్ల పర్వం పూర్తయి నాట్లు కార్యక్రమం సాగుతోంది. అపరాల సాగులో వర్షాలు మందగించడం వల్ల ఇబ్బందులు తప్పడం లేదు.

జూన్‌లో నాలుగు మండలాల్లో..

ఈ ఏడాది జూన్‌లో సాధారణ వర్షపాతం 111.9 మిల్లీ మీటర్లు కాగా 182.1 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే సాధారణం కన్నా 62.8 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. అయితే నాలుగు మండలాల్లో మాత్రం మైనస్ వర్షపాతాలు నమోదయ్యాయి. వేలేరుపాడు మైనస్ 50.4 శాతం, కుక్కునూరు మైనస్ 56.5 శాతం, బుట్టాయిగూడెం మైనస్ 0.1 శాతం, ఆగిరిపల్లి మైనస్ 6.1 శాతం వర్షాలు కురిశాయి.

జూలైలో మైనస్ 22.4 శాతం వర్షపాతం

జూలైలో మొదటి నుంచి వర్షాలు పూర్తిగా మందగించాయి. ఈ నెలలో జిల్లాలోని 24 మండలాల్లో మైనస్ వర్షపాతాలు నమోదయ్యాయి. జూలైలో సాధారణ వర్షపాతం 242.1 మిల్లీ మీటర్లు కాగా 187.9 మి.మీ మాత్రమే అంటే మైనస్ 22.4 శాతం వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనాలు, అల్పపీడనాలు ఏర్పడినా నైరుతి రుతుపవనాలు బలపడలేక పోయాయి. జిల్లాలో 24 మండలాల్లో సాధారణం కన్నా తక్కువగానే వర్షపాతాలు నమోదయ్యాయి. కుక్కునూరు మైనస్ 18.5, టి.నరసాపురం మైనస్ 18.3, జీలుగుమిల్లి మైనస్ 5.4, బుట్టాయిగూడెం మైనస్ 16.6, పోలవరం మైనస్ 30.3, కొయ్యలగూడెం మైనస్ 31.9, జంగారెడ్డిగూడెం మైనస్ 10.4, ద్వారకాతిరుమల మైనస్ 24.2, ఉంగుటూరు మైనస్ 53, భీమడోలు మైనస్ 37.9, పెదపాడు మైనస్ 40.1, ఏలూరు రూరల్ మైనస్ 48.2, దెందులూరు మైనస్ 34.4 (మిగతా 8వ పేజీలో)

పనిచేయని ఫోన్‌లు మాకొద్దు..

పనిచేయని ఫోన్‌లు మాకొద్దంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు తమ నిరసన తెలుపుతూ సోమవారం అయా ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సెల్‌ఫోన్లను పై అధికారులకు అందజేశారు. ప్రభుత్వం తమపై ఫోన్ల ద్వారా అధికంగా పనిభారం మోపడాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఫోన్లు సరిగా పనిచేయడం లేదని, సిగ్నల్స్ లేకపోవడం, యాప్‌లు ఓపెన్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని ఇబ్బందులు పడుతుంటే విధులు సరిగ్గా నిర్వహించడం లేదంటూ పైఅధికారులు పేర్కొనడం సరికాదన్నారు.


పెదపాడు సీడీపీవో కార్యాలయంలో ఫోన్లు అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నూజివీడు సబ్ కలెక్టర్‌గా వినూత్న



నూజివీడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):నూజివీడు సబ్ కలెక్టర్‌గా బొల్లిపల్లి వినూత్నను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2023 బ్యాచ్‌కు చెందిన ఆమె తొలి పోస్టింగ్ ఇక్కడ సబ్ కలెక్టర్‌గా నియమించారు. ప్రస్తుత సబ్ కలెక్టర్ బి.స్మరణరాజ్‌ను బదిలీ చేసింది.

వేల్పుచర్ల సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ముసునూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):వేల్పుచర్ల సర్పంచ్ పుట్ల మోహన్‌రావు చెక్ పవర్‌ను రద్దు చేస్తూ డీపీవో అధికారిణి కె.అనురాధ సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్టు ఎంపీడీవో బి.ఎ.సత్యనారాయణ తెలిపారు. వేల్పుచర్ల పంచాయతీ నిధుల వినియోగంలో అవకతవకలు జరిగినట్టు గ్రామానికి చెందిన కొందరు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం నివేదిక ఆదారం గా సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నట్టు ఉన్నతాధి కారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీనిపై వారం రోజుల్లోగా గ్రామ సర్పంచ్ కలెక్టర్ వెట్రిసెల్వికి అప్పీలు చేసుకోవచ్చని డీపీవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


అడ్మిషన్ల ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపల్ అపర్ణ

ఉద్యాన విద్యతో విస్తృత అవకాశాలు

- హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ అపర్ణ.. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

నూజివీడు టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఉద్యాన విద్యతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడుతున్నాయని నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం, హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డి.అపర్ణ అన్నారు. సోమవారం హార్టికల్చర్ పాలిటెక్నిక్ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు. మొత్తం 40 సీట్లకు తొలి రోజు 26 మంది అడ్మిషన్లు పొందారని, మిగిలిన సీట్లకు త్వరలో అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కళాశాలలో సంప్ర దించవచ్చని ఆమె తెలిపారు. రెండేళ్లకు కలిపి మొత్తం రూ.54 వేలు ఫీజు ఉంటుందని పేర్కొన్నారు.

ఏలూరులో వైద్యుల నిర్లక్ష్యం..
లోపలి పేజీలో..

మరో ఛాన్స్

- ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లు
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నిర్బంధ విద్యా హక్కు చట్టం 12(1)సీ కింద ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలోకి 25 శాతం సీట్లకు నిర్ణీత వర్గాల కుటుంబాలకు చెందిన పిల్లలు ఉచిత అడ్మిషన్లను పొందేందుకు ప్రభుత్వం మరో అవకాశాన్నిచ్చింది. ఏటా రెండు విడతలకే ఈ అడ్మి షన్లు పరిమితం కాగా, తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం మూడో విడత అడ్మిషన్లకు అవకాశమిస్తూ మంగళవారం నుంచే దరఖాస్తుల స్వీకరణకు వెసులుబాటు కల్పించింది. ఆ మేరకు సోమవారం సమగ్రశిక్ష ఏఎస్‌పీడీ అన్ని జిల్లాల ఏపీసీలతో నిర్వహించిన వెబెక్స్ సమావేశం సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాన్ని వెల్లడించగా, సాయంత్రానికల్లా ఉత్తర్వులు విడుదల య్యాయి. మూడోవిడత అడ్మిషన్లకు మార్గదర్శకాలను సవరించారు.

ఆ ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 12(1)సీ కింద ఉచిత అడ్మిషన్ కోసం ఇప్పటి వరకు మూడు కిలోమీటర్ల పరిధిలోని పాఠశాల లనే పరిగణనలోకి తీసుకోగా, తాజాగా దీనిని ఐదు కిలోమీటర్ల పరిధికి పెంచారని ఎస్ఎస్ఏ జిల్లావర్గాలు వెల్లడించాయి. ఈ వెసులుబాటు వల్ల ఎక్కువమంది బాలలు తమ పరిధిలోని ప్రైవేటు పాఠశాలలకు ఐచ్ఛికాల(ఆప్షన్)ను ఇచ్చుకునేందుకు అవకాశం ఏర్పడింది. వాస్తవానికి ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునేవారి సంఖ్య ఎక్కువగానే ఉండడం, ఆ మేరకు సీట్లు ఖరారైనా వారికి నచ్చిన స్కూలు రాకపోవడం, తదితర కారణాలతో కేటాయించిన ప్రైవేటు పాఠశాలల్లో జాయినైన పిల్లల సంఖ్య తక్కువగా ఉంటోంది. జిల్లాలో ఈ ఏడాది 12(1)సీ కింద మొత్తం 164 పాఠశాలల్లో తొలివిడత అడ్మిషన్లు 392 మంది పిల్లలకు ఖరారు కాగా వీరిలో 286 మంది మాత్రమే చేరగా, రెండోవిడత కేటాయింపులో 134 మందికి ఉచితసీట్లు లభించినా కేవలం 80 మంది మాత్రమే చేరడం గమనార్హం. ఈ నేపథ్యంలో తాజాగా చేపట్టిన మూడోవిడత అడ్మిషన్లకు ప్రైవేటు పాఠశాలను ఎంచుకునే పరిధిని ఐదు కిలోమీటర్లకు పెంచడంతో ఎక్కువ మందికి ఉపకరిస్తుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఉచిత అడ్మిషన్ల 12(1)సీ కింద ఒకటో తరగతిలోకి పిల్లలు తమకు కేటాయించిన ప్రైవేటు పాఠశాలలో చేరితే హైస్కూలు విద్యవరకు అదేస్కూలులో ఎటువంటి ఫీజు చెల్లించకుండానే ఉచితంగా చదువుకునే వెసులుబాటు ఉంది.

ఈ విధంగా చేరిన పిల్లల బోధనకయ్యే ఖర్చులను ప్రభుత్వమే రీయింబర్స్ మెంట్ కింద సంబంధిత ప్రైవేటు పాఠశాలకు చెల్లిస్తుంది. ఆ మేరకు ప్రైవేటు పాఠశాలలను మూడు కేటగిరీలుగా వర్గీకరించి, బోధన ఖర్చు ల కింద రీయింబర్స్‌చేసే ఫీజులను ఇటీవలే ఖరారు చేసింది. మూడో విడత అడ్మిషన్లకు ఎవరైనా దరఖాస్తు చేయదలిస్తే ముందుగా సీఎస్ఈ వెబ్‌సైట్‌ను సందర్శించి 12(1)సీ ఆప్షన్‌లో ప్రొఫైల్‌ను మొబైల్ నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఓటీపీ వస్తుంది. ఆ వెంటనే స్ర్కీన్‌పై కనబడే ప్రైవేటు స్కూల్స్‌కు ఆప్షన్లకు ఇచ్చుకోవచ్చు. కాగా ఈ నెల 11వ తేదీ నుంచే అన్ని పాఠశాలల్లో ఫార్మేటివ్ (ఎఫ్ఏ-1) పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇపుడు చేపడుతున్న మూడోవిడత అడ్మిషన్లకు స్పందన ఎంత వరకు ఉంటుందన్న డైలమా నెలకొంది.


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ వెట్రిసెల్వి


ఏలూరు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):పీజీఆర్ఎస్‌లో ప్రజలు సమర్పించిన అర్జీలు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, నిర్లక్ష్యం చూపవద్దంటూ కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి 377 అర్జీలు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల వారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్‌తో పాటు జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో శీహరి, డీఆర్డీవో పీడీ విజయరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, సర్వే ఏడీ అన్సారీ, ఎస్‌డీసీ భాస్కర్ అర్జీలు స్వీకరించారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కిశోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు

చట్ట ప్రకారం న్యాయం చేస్తాం : ఎస్పీ

ఏలూరు క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేయించి త్వరితగతిన చట్ట ప్రకారం న్యాయం చేస్తామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని ఎస్పీ, ఏఎస్పీ సూర్యచంద్రరావు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి సోమవారం ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ కార్యాలయంలోను నిర్వహిస్తున్నారని ఫిర్యాదుదారులు సమీప డీఎస్పీ, సీఐ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు వృథా కాదన్నారు. ప్రతి ఫిర్యాదుదారుడు తమ ఫిర్యాది స్థితిగతులను టోల్ ఫ్రీ నంబర్ 1100కు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. మొత్తం 63 ఫిర్యాదులు రాగా సత్వర పరిష్కార చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ట్రిపుల్ ఐటీలోకి.. అక్షయపాత్ర!



- మెస్ నిర్వహణకు ప్రతిపాదనలు
- రూ.116.75 చెల్లింపునకు ఫుడ్ కమిటీ సిఫార్సు
- కేవలం శాకాహారమే వద్దన.. మరో సంస్థకు నాన్ వెజ్ ఆహార కాంట్రాక్టు
- విజిటేరియన్‌కు రూ.110.. నాన్ వెజ్‌కు మరో రూ.12.25
- రూ.100లకు నాణ్యమైన భోజనం ఇస్తామంటున్న ప్రస్తుత నిర్వాహకులు

(నూజివీడు-ఆంధ్రజ్యోతి)
రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో విద్యార్థులకు భోజన సదుపాయాల కల్పనను అక్షయపాత్రకు ఇచ్చేందుకు రంగం సిద్ధమవుతోంది. ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, శ్రీకాకుళం, ఆర్కే వ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌లు ఉండగా, వీటి పరిధిలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు 25 వేల మందికిపైగా ఉన్నారు. యూనివర్సిటీ పరిధిలో తరచూ మెస్ నిర్వహణలపై విద్యార్థుల నుంచి ఆరోపణలు రావడంతో మెస్‌ల నిర్వహణ అక్షయాత్రకు ఇస్తే ఎలా ఉంటుందనే అంశంపై విద్యా శాఖ మంత్రి లోకేశ్ పరిశీలిన్నారు. జూలై 1న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి మెస్ నిర్వహణ అక్షయపాత్రకు లేదా మరో సంస్థకు అప్పగించాలని ప్రతిపాదన పెట్టగా మంత్రి లోకేశ్ ఆ దిశగా యోచిస్తున్నట్టు సమాచారం.

ట్రిపుల్ ఐటీకి మెస్‌ల నిర్వహణ భారం

ఆర్జీయూకేటీ పరిధిలో ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తున్న 25 వేల మంది విద్యార్థులకు ప్రస్తుతం 12 మెస్‌లను ఏర్పాటుచేశారు. ఈ మెస్‌లు అక్షయ పాత్రకు ఇవ్వడం ద్వారా ఆర్జీయూకేటీపై అధికంగా భారం పడుతోంది. గత విద్యా సంవత్సరంలో మెస్‌ల నిర్వహణకు సంబంధించి ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.88 నిర్వాహకులకు చెల్లిస్తుండగా, పెరిగిన ధరల దృష్ట్యా భోజన వసతి కల్పనకు రూ.116.75 వరకు చెల్లించవచ్చని గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫుడ్‌కమిటీ సిఫారసు చేసింది. ఇదే అంశాన్ని దృష్టిలో పెట్టుకుని టీడీపీ ప్రభుత్వం అక్షయపాత్రకు ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.110 చెల్లించడం ద్వారా మెస్ నిర్వహణ అప్పగించేందుకు నిర్ణయించినట్టు తెలుస్తోంది. హిందూ ధార్మిక సంస్థ అయిన అక్షయపాత్ర మాంసాహారం అందించదు. శాఖాహార భోజనంలోనూ ఉల్లి, వెల్లుల్లి, అల్లంను వినియోగించదు. కాని ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అందిస్తున్న మెనూలో శాఖాహారంతోపాటు రెండు రోజులు మాంసాహారం, ఐదు రోజులు కోడిగుడ్డును అందించాలి. ఈ నేపథ్యంలో ఫుడ్ కమిటీ నిర్ణయించిన రూ.116.75 లలో అక్షయ పాత్రకు ఇచ్చే రూ.110 పోను, మిగిలిన రూ.6.75 పైసలకు మరో రూ.5.50 పైసలు కలిపి రూ.12.75 పైసలను మాంసాహారం అందించే సంస్థకు అందించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. దీంతో ఆర్జీయూకేటీ ప్రస్తుతం ఇస్తున్న రూ.88లకు అదనంగా మరో రూ.33 చెల్లించాలి.

రూ.100లకే అందిస్తాం..

ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనాలను మాంసాహారంతో కలుపుకుని రూ.100 చెల్లిస్తే పూర్తి నాణ్యతతో అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆర్జీయూకేటీ పరిధిలో ప్రస్తుతం భోజన సదుపాయాలు కల్పిస్తున్న 12 మంది మెస్ నిర్వాహకులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా సమాచారం అందించారు.


ట్రిపుల్ ఐటీ మెస్‌లో భోజనాలను చేస్తున్న విద్యార్థినులు

మొదలైన అభ్యంతరాలు

మెస్‌ల నిర్వహణ అక్షయపాత్రకు అప్పగించడంపై ప్రారంభ దశలోనే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. హిందూ ధార్మిక సంస్థ అయిన అక్షయపాత్ర శాఖాహార భోజనాన్ని అందిస్తుంది. ఉల్లి, వెల్లుల్లి, అల్లం వినియోగించదు. జాతీయ పౌష్టికాహార సంస్థ నిర్ణయం ప్రకారం బాలికలకు వ్యక్తిగత ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సదరు ఆహార పదార్థాలను వినియోగించాలని తమ సిఫార్సుల్లో పేర్కొంది. ఈ పరిస్థితుల్లో అక్షయపాత్రకు భోజన కల్పనను అందించడం ద్వారా జాతీయ పౌష్టికాహార సంస్థ ప్రతిపాదనలను ఎలా వ్యతిరేకిస్తారంటూ విద్యార్థినులు ప్రశ్నిస్తున్నారు. ఆర్జీయూకేటీలో విద్యనభ్యసిస్తున్న 25 వేల మందిలో దాదాపు 65 శాతం మంది విద్యార్థినులే. మరోవైపు భోజన సదుపాయాలను హిందూ ధార్మిక సంస్థకు అందించ డంపై ట్రిపుల్ ఐటీలోని ఇతర మతాలకు చెందిన విద్యార్థులు తమ అభ్యంతరాలను వ్యక్తపరుస్తున్నారు. టెండర్లను పిలవాల్సి వస్తే అక్షయపాత్రతో పాటు ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీ సంస్థలు సైతం మెస్‌ల నిర్వహణకు పోటీపడే అవకాశం కనిపిస్తోంది.

ఎకరం స్థలం ఇవ్వండి

ట్రిపుల్ ఐటీల్లో మెస్‌ల నిర్వహణను తమకు అప్పగించిన పక్షంలో (మిగతా 8వ పేజీలో)

పుట్టినరోజే నూరేళ్లు నిండాయి

- జ్వరంతో ఐదేళ్ల చిన్నారి మృతి .. చీరవల్లిలో విషాదం


సహస్ర (ఫైల్)

కుక్కునూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): 'పుట్టిన రోజే మమ్మల్ని వదిలి వెళ్లిపోయావా.. ఇవిగో కొత్త బట్టలు వచ్చాయి.. ఒకసారి వేసుకుందువు గాని లేమ్మా..' అంటూ తల్లి దండ్రుల రోదన చూపరులను కలిచివేసింది. పుట్టినరోజే కుమార్తె మృతి చెందడంతో ఆ తల్లి దండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. పుట్టినరోజే ఆ చిన్నారి జ్వరంతో మృతి చెందింది. కుక్కునూరు మండలం చీరవల్లిలో ఈ విషాదం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన యర్నం ప్రదీప్, కావేరి దంపతులకు కుమార్తె సహస్ర(5), కుమారుడు(3) ఉన్నారు. ఇటీవల సహస్రకు జ్వరం రావడంతో భద్రాచలంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న క్రమంలోనే ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో ఖమ్మంలోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. సోమవారం చిన్నారి పుట్టినరోజు కావడంతో ఆన్‌లైన్‌లో తల్లిదండ్రులు కొత్త బట్టలు ఆర్డర్ చేయడంతో ఇంటికి వచ్చాయి. మరోవైపు చిన్నారి మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. దీంతో కొత్త బట్టలు పట్టుకుని కుమార్తె మృతదేహాన్ని ఒళ్లో పెట్టుకుని తలిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. పదిహేను రోజుల క్రితమే సహస్ర ఒక ప్రైవేటు స్కూల్‌లో చేరింది. ఇంతలోనే జ్వరం బారిన పడడం, ఆపై మృతి చెందడం కుటుంబ సభ్యులను, బంధువులను కలచివేసింది. గ్రామంలో దోమల ఉధృతితోపాటు పారిశుద్ధ్యం లోపించిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



గణపవరంలో సీతాఫలాలు విక్రయిస్తున్న వ్యాపారి

సీతాఫలాలొచ్చేశాయ్..



పుష్కలంగా ఔషధాలు
ఆరోగ్యానికి మేలు
సీజన్‌కు ముందుగానే మార్కెట్‌లోకి..

గణపవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తొందరపడి ఓ కోయిల ముందే కూసింది అన్న చందంగా సీజన్ ముందుగానే సీతాఫలాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. సీజనల్‌గా లభించే పండ్లలో సీతాఫలాలకు ప్రత్యేకస్థానం ఉంది. సాధారణంగా వర్షాకాలంలో శ్రావణమాసం, వినాయకచవితి నుంచి సీతాఫలాలు మార్కెట్‌లో సందడి చేస్తాయి. సీజన్‌కు ముందుగానే మార్కెట్‌లోకి దర్శన మివ్వడంతో కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. చిన్నారుల నుంచి పెద్దవారు వరకు సీతాఫలం అంటే ఎంతో ఇష్టపడతారు.ఈ పండులో రుచితో పాటు పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఆరోగ్యం ఫలంగా పేరొందిన సీతా ఫలాలు వర్షాలు సమృద్ధిగా పడే కాలంలో అధికంగా లభిస్తాయి. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం, రాజమండ్రి, ఏలూరు జిల్లా మెట్ట ప్రాంతాలు, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి పుష్కలంగా లభించే ఈ సీతాఫలాలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో అధికంగా విక్రయిస్తున్నారు. గణపవరం మార్కెట్ బొబ్బిలి వంతెన వద్ద భీమవరం తాడేపల్లి గూడెం, ఏలూరు, రహదారుల వెంబడి ఈ సీతాఫలాల విక్రయాలు సాగుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ఈ సీతాఫలాలు రుచిలో సిమ్లా యాపిల్‌ను మరిపిస్తాయి. ధర కూడా ఎక్కువగానే ఉంటుంది.గుజ్జు ఎక్కువ, గింజ తక్కువగా ఉంటుంది. మెట్ట ప్రాంత సీతాఫలాలు అయితే గింజ ఎక్కువ, గుజ్జు తక్కువగా ఉంటాయి. అందుకే వినియోగ దారులు తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన సీతా ఫలాల పైనే మక్కువ చూపుతున్నారు. ఒకప్పుడు విస్తారంగా సీతాఫలాల తోటలు అధికంగా ఉండేవి. జాతీయ రహదారుల పక్కన సీతాఫలాల తోటలుండేవి. అయితే ప్రస్తుతం రియల్ ఎస్టేట్ పుణ్యమా అంటూ తోటలు తగ్గిపోయి మెట్ట ప్రాంతాల్లో కూడా సీతాఫలాల తోటలు తగ్గుముఖం పట్టడంతో పండ్లకు డిమాండ్ ఏర్పడింది. మార్కెట్‌లో ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఇవి పుష్కలంగా లభిస్తాయి. గణపవరంలో చిరు వ్యాపారులు ఎన్నో సంవత్సరాలు తరబడి సీతాఫలాల విక్రయాల ద్వారా స్థానికంగా జీవనోపాధి పొందుతున్నారు. మెట్ట ప్రాంతం, ఏజెన్సీ, తూర్పుగోదావరి రాజానగరంలో లభిస్తున్న సీతాఫలాలు కొనుగోలు చేసి ఇక్కడ మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం సీతాఫలాలు డజను రూ.150 - 250 వరకు సైజును బట్టి విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడ సీతాఫలాలు కొనుగోలు చేసి హైదరా బాదు, చెన్నై, ముంబయి వంటి ప్రాంతాలకు బస్సుల మీద కూడా బంధువులకు, స్నేహితులకు పంపిస్తున్నారు.

ఆరోగ్యానికి దివ్య ఔషధం



సీతాఫలాల్లో సీ విటమిన్‌తో పాటు ఏ, బీ, కే విటమిన్లు, ప్రోటీన్లు, కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీ షియం, పొటాషియం, ఐరన్ వంటి మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. మానసిక స్థితి నియం త్రణలో సహాయపడుతుంది. మెదడును బలోపేతం చేస్తుంది. రోగనిరోధక శక్తి పెంపొందిస్తుంది. ఉదయాన్నే బ్రేక్‌పాస్ట్‌లో తీసుకుంటే శరీరానికి కావల్సిన శక్తిని కూడా అందిస్తుంది. ముఖ్యంగా ఈ సీజన్‌లో సీతా ఫలాలు తింటే రోగాల బారినపడకుండా రక్షిస్తుంది. రక్తపోటు అదుపులో ఉంచుతుంది. జీర్ణవ్యవస్థను కాపాడుతుంది. రక్తహీనతతో బాధపడేవారికి ఈ పండు దివ్య ఔషధం. కీళ్ల నొప్పుల నివారణకు దోహద పడుతుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. గుండె సమస్యల నుంచి కాపాడేందుకు ఉపయోగపడుతుంది.

– ఓంకార్‌నాథ్, ప్రభుత్వ వైద్యాధికారి

ఉల్లి జోరు

సిద్ధంగా ఉన్న కర్నూలు ఉల్లి
సాగు విస్తీర్ణం పెంచిన రైతులు
మరో పది రోజుల్లో మార్కెట్‌కు..

తాడేపల్లిగూడెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్లో ఉల్లిధర పడనుంది. ఇప్పటికే మహారాష్ట్ర నుంచి వస్తున్న ధర తగ్గింది. ఇక మరో 10 రోజుల్లో కర్నూలు నుంచి ఉల్లి రానుంది. ఇప్పటికే అక్కడి రైతులు ఉల్లి తీసి కళ్లాల్లో ఆరబెట్టారు. అక్కడ ఎన్నడూ లేనంతగా రైతులు సాగు విస్తీర్ణాన్ని పెంచారు. గతం సంవత్సరం కర్నూలు ఉల్లికి విపరీతమైన డిమాండ్ వచ్చింది. దీనికి కారణం మహా రాష్ట్రలో వర్షాల వల్ల అక్కడ పంట దెబ్బతింది. దీంతో కర్నూలు ఉల్లి క్వింటా రూ.4500 నుంచి 6000కు విక్రయాలు జరిగాయి. కర్నూల్లో ఉల్లి సాగు చేసిన రైతుకు కాసుల వర్షం కురిసింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు ఈసారి సాగువిస్తీర్ణం పెంచారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో దిగుబడులు గణనీ యంగా ఉన్నాయి. ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి మాత్రం మార్కెట్లో ఉల్లి దిగుమతి అవుతోంది. రోజుకు 10 నుంచి 15 లారీల ఉల్లి వస్తుంది. ఒక్కొ లారీకి రూ.25 టన్నుల నుంచి 35 టన్నుల లోడుతో ఇక్కడికి వస్తున్నాయి. అక్కడ ఉల్లి హోల్ సేల్‌గా క్వింటా రూ.1300 నుంచి రూ.1700 విక్రయిస్తున్నారు. కిరాయిలు కలుపు కుంటే అత్యంత నాణ్యమైన ఉల్లి ఇక్కడకు చేరేసరికి రూ.క్వింటా రూ.1900కి వస్తుంది. గతవారంతో పోలిస్తే మహారాష్ట్ర ఉల్లి కూడా క్వింటా నాణ్యమైంది రూ.200 తగ్గింది.

పది రోజుల్లో మార్కెట్లోకి కర్నూలు ఉల్లి

కర్నూల్లో ఉల్లి పంట చేతికొచ్చేసింది. ఉల్లిని రైతులు తీసి కళ్లాల్లో ఆరబెట్టారు. నాలుగు రోజుల్లో వీటిని బస్తాలో నింపుతారు. అక్కడ నుంచి మార్కెట్‌కు వస్తుంది. ఈ సంవత్సరం కర్నూలు ఉల్లి మంచి నాణ్యతా ప్రమాణాలతో పెద్ద సైజుల్లో ఉందని వ్యాపారులు చెబుతున్నారు. వాతావరణం అనుకూలిస్తే ఉల్లి రైతులకు అను కూలంగా ఉంటుందని చెబుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా, అధిక వర్షాలతో తడిసిన ఈ ఉల్లి నిలవకు ఆగదని చెబుతు న్నారు. కర్నూలు ఉల్లి వస్తే మార్కెట్లోకి మహారాష్ట్ర ఉల్లి దిగు మతులు తగ్గుతాయని చెబుతున్నారు. కర్నూలు ఉల్లి వస్తే మార్కెట్ మరింత పతనమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నా యని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఆటోలపై జోరుగా వ్యాపారం

ఉల్లి వ్యాపారం ఇప్పుడు ఆటోలతో ఎక్కువగా జరుగుతుంది. ఆటోలను ఉపాధిగా ఎంచుకున్న యువత ఇప్పుడు ఆట్లో ఉల్లిని తీసుకెళ్లి ఇంటివద్దకే ఉల్లి విక్రయాలు చేస్తున్నారు. ఇలా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సుమారు 300కు పైగా ఆటోల్లో విక్రయించేవారు ఉన్నారంటే వ్యాపార తీవ్రత అర్థం చేసుకోవచ్చు. వీరంతా తాడేపల్లిగూడెం హోల్‌సేల్ వ్యాపారుల వద్దకు వచ్చి నాసి రకం, మేలు రకం కొనుగోలు చేసి వాటిని కలిపేసి 5 కేజీలు రూ.100, చిన్నపాయి ఉంటే 6 కిలోల వంతున విక్రయిస్తున్నారు.



కళ్లాల్లో ఆరబెట్టిన ఉల్లిపాయలు

కర్నూలు టూ బంగ్లాదేశ్

ఘాటుగా ఉండటంతో కర్నూలు ఉల్లిని బంగ్లాదేశ్, బెంగాల్, ఒడిశా ప్రాంత వాసులు ఎక్కువగా ఇష్టపడతారు. గతంలో తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్‌కు మంచి డిమాండ్ ఉండేది. ఇప్పుడు వ్యాపారులు పెరిగారు. కర్నూలు నుంచి తాడేపల్లిగూడెం వచ్చిన తరువాతే ఇతర ప్రాంతాలకు వెళ్లేది. ఇలా రోజుకు 100 నుంచి 150 లారీలు వచ్చేవి. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. వ్యాపారులు ఇప్పుడు నేరుగా కర్నూలు వెళ్లి కొనుగోలు చేసుకుని పశ్చిమ బెంగాల్, ఒడిశా ప్రాంతాలకు తీసుకుపోతున్నారు. దీంతో తాడేపల్లిగూడెం మార్కెట్‌కు వచ్చే లారీల సంఖ్యం గత రెండు సంవత్సరాలుగా తగ్గింది.

నిలకడగా కూరగాయల ధరలు

మార్కెట్లో కూరగాయల ధరలు నిలకడగానే ఉన్నాయి. దాదాపు 80 శాతం కూరగాయలు కిలో రూ.50కు దిగువనే ఉన్నాయి. పచ్చిమిర్చి కిలో రూ.80 నుంచి 100 మధ్య విక్రయించారు. ఆగాకర రూ.200, నాటు చిక్కుళ్లు 120 విక్రయిస్తున్నారు.



పొగపెడితే పోతాయా ?

దోమల నుంచి రక్షణకు మస్కిటో క్వాయిల్స్, అగర్‌బత్తీల వినియోగం
కొనితెచ్చుకుంటున్న అనారోగ్య సమస్యలు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): దోమలకు ఇప్పుడు ఈ కాలం ఆ కాలం..అని ఏమీ లేదు.. ఏ కాలంలో అయినా పీక్కు తింటున్నాయి... దోమల దాడితో జనం బెంబేలెత్తుతున్నారు. వాటి నుంచి రక్షించుకు నేందుకు రకరకాల మార్గాలు వెతుకుతు న్నారు. దోమల కాటు వల్ల వచ్చే అనారోగ్య సమస్యల నుంచి బైటపడటానికి మార్కెట్‌లో దొరుకుతున్న మస్కిటో క్వాయల్స్, అగర వత్తులు వంటివి వాడుతున్నారు. ఈ పొగ పెట్టుకుని తలుపులు పూర్తిగా మూసి వేయడం వల్ల పొగ గదిలోనే ఉండిపోవడంతో ఆస్తమా వంటి వ్యాధులు ఉన్నవారు, చిన్నపిల్లలు, వృద్ధులకు అనారోగ్య సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరి స్తున్నారు. క్వాయల్స్, అగర వత్తుల పొగ వల్ల దోమలు చనిపోవడం.. బయటకు పారిపో వడం వంటివి జరగదు. పొగ ఉన్నంతసేపు నిద్రావస్థలో ఉంటాయి. పొగవాసన తగ్గిన వెంటనే దోమలు విజృంభి స్తుంటాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఊపిరి తిత్తులపై ప్రభావం



దోమల నివారణకు వినియోగించే మస్కిటో క్వాయల్స్ (చక్రాలు), అగర వత్తుల పొగ పీల్చడం వల్ల ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. తలుపులు మూసి వేసి పొగ బయటకు వెళ్లే మార్గం లేక పోవడంతో ఆ పొగ పీల్చడంతో ఆయాసం, దగ్గు వస్తుంటాయి. ప్రమాదకరమైన ఉత్ప త్తులు వాడటం కన్నా దోమ తెరలు ఏర్పాటు చేసుకుంటే మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు. ఇంటి పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవడం, నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఫలితం ఇవ్వని నివారణ చర్యలు

దోమల నివారణకు మున్సిపల్ అధికారులు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ సరైన ఫలితం రావడం లేదు. మలాథియాన్ మందును 10 ఎంఎల్ ద్రావణంలో 10 లీటర్ల నీరును కలిపి మురుగు డ్రైయినేజీల్లో పిచికారీ చేస్తుంటారు. సాయంత్రం వేళల్లో ఫాగింగ్ చేస్తుంటారు. ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు ఉన్నప్పుడు వాటిల్లో మందు కలిపిన బాల్స్‌ను వేస్తున్నారు. ఎన్ని చర్యలు తీసుకుంటున్నా దోమల నివారణ మాత్రం జరగడం లేదు. దీంతో ప్రజలు మస్కిటో క్వాయల్స్ అగర బత్తీలను వాడి ఆరోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నారు.



తాడేపల్లిగూడెం మార్కెట్‌లో పూల విక్రయాలు

మార్కెట్‌లో శ్రావణ సందడి

ఈ వారంలో వరలక్ష్మీ వ్రతం, వచ్చేవారం వినాయక చవితి పండుగలు
అప్పుడే చుక్కలు తాకుతున్న పండ్లు, పూల ధరలు



పెంటపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం సందడి వచ్చేసింది. తాడేపల్లి గూడెం మార్కెట్‌లో శ్రావణ సందడి మొద లైంది. ఈ నెల 8వ తేదీ వరలక్ష్మీ వ్రతం... ఇదే నెల 27వ తేదీ వినాయకచవితి ఉండటంతో మార్కెట్ కళకళలాడుతోంది. సాధారణంగా వరలక్ష్మీ వ్రతం ఆగస్టు నెలలో వస్తే వినాయ కచవితి సెప్టెంబరు మాసంలో వస్తుంది. ఇలా రెండు పండుగలు ఒకే నెలలో రావడం, శ్రావణ మాసం పేరు చెప్పి ఇప్పటి నుంచే పూలు, పండ్లు ధరలకు రెక్కలు వచ్చేశాయి. కొన్ని రోజుల క్రితం వరుకూ కేజీ రూ.250 నుంచి రూ.300 ఉంటే చామంతి పూల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ చామంతి ధరలు రూ.450 నుంచి రూ.500 వరుకూ విక్రయాలు జరుపు తున్నారు. దీంతో రిటైల్ ధరలు చుక్కలను తాకేలా పెరిగిపోయాయి. గతంలో రూ. 20 లకు చామంతి పూలు ఇవ్వమంటే కనీసం 15 నుంచి 20 పూల వరుకూ వచ్చేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రూ.20లకు చామంతి పూలు కావాలంటే కనీసం 10 పూలు కూడా రాని పరిస్థితి నెలకొంది. ఇక మల్లెపూలు, కనకాంబ రాలు ధరలు కూడా ఇలానే ఉన్నాయి. మొన్నటి వరుకూ మూర రూ.40 అమ్మే మల్లెపూలు ప్రస్తుతం రిటైల్‌లో రూ.80 వరుకూ విక్రయాలు సాగిస్తున్నారు. కనకాంబ రాలు పరిస్థితి ఇలాగే ఉంది. మూర రూ.30 అదనంగా వేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇక పండ్ల ధరలు కూడా ఆకాశాన్ని తాకు తున్నాయి. గతంలో రూ.100 ఐదు దానిమ్మ కాయలు ఇచ్చేవారు. ఇప్పుడు 3 కూడా రావడం లేదు. యాపిల్‌కూడా సైజ్‌ను బట్టి భారీస్థాయిలో అమ్మకాలు జరుపుతున్నారు. రూ.500 పట్టికెళ్తే కనీసం అవసరం అయిన పండ్లు వచ్చే పరిస్థితి లేదు. ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో వినియోగ దారులు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే పండుగ దగ్గరలో పూలు, పండ్లు కొనే పరిస్థితి ఉంటుందా అంటూ పెదవి విరుస్తున్నారు.



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

చేనేతను ఆదరించాలి : జేసీ రాహుల్

భీమవరం టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ఆదరించి, చేనేత రంగాన్ని ప్రోత్సహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలను పరిశీలించారు. స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల చేనేత వస్త్రాల నాణ్యత, ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. భారతీయ సంస్కృతిలో భాగమైన చేనేత కళను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజలలో చేనేత వస్త్రాలు ధరిం చడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించా లన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 7వ తేదీన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే జాతీయ చేనేత దినోత్సవం జరుపుతామన్నారు. 7వ తేదీ ఉదయం 9 గంటలకు భీమవరం పట్టణంలోని ప్రకాశం చౌక్ నుంచి మునిసిపల్ కార్యాలయం వరకు చేనేత ర్యాలీ నిర్వహిస్తామ న్నారు. చేనేత జౌళి శాఖ అధికారి కె.అప్పారావు, స్టాల్ మేనేజర్ పి.అనిల్‌కుమార్, ఆప్కో సిబ్బంది ఉన్నారు.



అనాథ బాలలకు ఆధార్ నమోదు చేయిస్తున్న అధికారులు

అనాథ బాలలకు ఆధార్ నమోదు

ఏలూరు క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఆధార్‌లేని అనాథ బాలలను 27 మందిని గుర్తించి, వారికి ఆధార్ నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సాతి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. 27 మంది బాలలలో 16 మంది బాలలకు ఇంతకుముందు ఆధార్ నమోదు పూర్తయిం దన్నారు. హనుమాన్ జంక్షన్‌లోని ఆశాజ్యోతి ఆధ్వర్యంలో ఆశ్రయం పొందుతున్న 11 మంది విభిన్న ప్రతిభావంతులకు సోమవారం సత్రం పాడులోని ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆధార్ నమోదు చేశామన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం దేశంలో ప్రతి పౌరుడు గుర్తింపు కార్డు కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గుర్తింపు కార్డులేని అనాథ బాలలు ఎవరైనా ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించి గుర్తింపు కార్డుల జారీకి కృషి జరుగుతుందని తెలిపారు. గుర్తింపు కార్డులేని అనాథ బాలల సమాచారం ఉన్న ప్రజలు దగ్గరలోని న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించవచ్చని తెలిపారు. డీసీపీవో సూర్యచక్ర వేణి, ఆశాజ్యోతి విభిన్న ప్రతిభావంతులు ఆశ్రమం మేనేజర్ మాధ వీలత, సీడబ్ల్యూసీ ఇన్‌ఛార్జి ఛైర్మన్ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

చిక్కని చేప



వేటకు ఎండ దెబ్బ
వరదొచ్చినా వర్షాలు లేవు
వేసవిని తలపిస్తున్న ఎండలు
ప్రతికూల వాతావరణంతో దొరకని మత్స్య సంపద



నరసాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేటకు ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. వేట ప్రారంభమై 50 రోజులు గడిచినా నేటికి సరిగ్గా వేట సాగలేదు. ఇందుకు వాతావరణంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులే కారణమని మత్స్యకారులు వాపోతున్నారు. ప్రస్తుతం గోదావరికి వరదొచ్చినా వర్షాలు లేకపోవడం, వేసవిని మైమరిపిస్తూ ఎండలు కాస్తుండటంతో వల వేసినా చేప చిక్కని పరిస్థితి నెలకొంది. దీంతో చాలామంది మత్స్యకారులు బోట్లను కట్టేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు చూడలేదని వాపోతున్నారు. సాధారణంగా గోదావరికి వరదొస్తే వర్షాలు కురిసినట్లే.. వాతావరణం కూడా చల్లబడుతుంది. ఇలాంటి పరిస్థితులు వేటకు అనుకూలంగా ఉంటాయి. మత్స్యకారులు కూడా ఉత్సాహంగా వేట సాగిస్తుంటారు. అయితే ఈసారి ఆగస్టు వచ్చినా దీనికి భిన్నమైన పరిస్థితులు నెలకున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మే నెలను తలపించే విధంగా భానుడు భగభగలాడుతున్నాడు. ఉష్ణోగ్రతలు కూడా 37 డిగ్రీలు దాటుతున్నాయి. ఈ కారణంగా సముద్ర నీరు వేడెక్కుతుంది. దీంతో మత్స్య సంపద అంతా సముద్రగర్భంలో చేరిపోతున్నాయి. గాలలు కూడా వీయడం లేదు. దీంతో రాత్రయినా కడలి చల్లబడటం లేదు. ఈ కారణంగా వల వేసినా మత్స్య సంపద చిక్కని పరిస్థితి నెలకొంది. సాధారణంగా వరద సమయంలో అపార మత్స్య సంపద గర్భం నుంచి చప్పనీటి కోసం ఎదురొస్తుంది. అయితే ఎండ వేడిమికి ఈ పరిస్థితి కనిపించడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. ఈ కారణంగా వేటకు వెళ్లి రెండు మూడు రోజులు సముద్రంలో వేట సాగించినా కనీసం ఖర్చులు కూడా రావడం లేదంటున్నారు.

రోజుకు రూ.3 నుంచి 4 కోట్లు ఎగుమతులు

సాధారణంగా ఈ సీజన్‌లో మత్స్య సంపద ఎగుమతులు పుష్కలంగా ఉంటాయి. ఆగస్టు నెల వచ్చిందంటే వరదతో పాటు వర్షాలు కూడా పడుతుంటాయి. అయితే ఈసారి దీనికి భిన్నమైన పరిస్థితి ఉండటంతో కనీసం రోజుకు రూ.10 లక్షలు కూడా మత్స్య సంపద ఎగుమతికి నోచుకోవడం లేదు. దీంతో మత్స్యకారులతో పాటు దీనిపై ఆధారపడ్డ అనేక మంది కార్మికులు ఉపాధికి దూరమవుతున్నారు. సాధారణంగా నరసాపురం తీరంలో వేట సాగించేందుకు ఈ సీజన్‌లో 300 నుంచి 500 బోట్లు వరకు వస్తుంటాయి. వీటితో పాటు ఫైబర్ బోట్లు ఎక్కువే. ఈసారి మత్స్య సంపద చిక్కకపోవడంతో మత్స్యకారుల్లో నిరుత్సాహం నెలకొంది.

వాతావరణ ప్రభావమే..

సాధారణంగా ఈ సీజన్‌లో పుష్కలంగా మత్స్య సంపద దొరుకుతుంది. అయితే ఈ ఏడాది దీనికి భిన్నమైన పరిస్థితులు కనిపి స్తున్నాయి. ఆగస్టు వచ్చినా వర్షాలు లేవు. వీటికి తోడు వేసవిని తలపిస్తూ ఎండలు కాస్తున్నాయి. ఎండ వేడిమికి సముద్రంలోని మత్స్య సంపద కిందకు వెళ్లిపోతుంది. ఎన్ని రోజులు ఉండి వేట సాగించినా ఇదే పరిస్థితి. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదు. వర్షాలు వస్తేగాని వేటకు అనుకూల పరిస్థితులు కనిపించడం లేదు.

– పీతల ప్రసాద్, ఎగుమతిదారుడు

ఇవేం ఎండలు బాబోయ్ !



ఎండకు నిర్మానుషంగా మారిన అలంపురం జంక్షన్

పెంటపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలోనూ సూరీడు మండిపోతున్నాడు. భగభగలాడుతూ విరుచుకు పడుతున్నాడు. ఇవేం ఎండలంటూ ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే ఎండ దంచేస్తోంది. బయటకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు.. రహదారులు నిర్మానుషంగా మారుతున్నాయి. చాలామంది ఎండకు భయపడి పనులకు కూడా వెళ్లని పరిస్థితి నెలకొంది. వృద్ధులు, చిన్నపిల్లల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మరోపక్క రైతులు కూడా పెరుగుతున్న ఎండలకు భయపడిపోతున్నారు. ప్రస్తుతం వరిచేలు నాట్లు వేసే దశలో ఉన్నందున వర్షాలు పడాలి.. శ్రావణమాసం వచ్చి వారం రోజులు గడుస్తున్నా సరిగా వర్షాలు పడటం లేదని వేసవి కాలాన్ని తలపించేలా ఎండలు కాస్తున్నాయని ఇటువంటి పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదని రైతులు చెబుతున్నారు.



తణుకు రోటరీక్లబ్‌లో జరిగిన 'సాంస్కృతిక వాదం రాజ్యాంగ విలువలు' అనే అంశంపై మాట్లాడుతున్న కొప్పర్తి వెంకటరమణమూర్తి

మత జాతీయ వాదం రాజ్యాంగ విలువలకు విరుద్ధం

తణుకు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):మెజారిటీ మత జాతీయవాదం రాజ్యాంగ విలువలకు విరుద్ధమైనదని ప్రముఖ చరిత్రకారుడు కొప్పర్తి వెంకట రమణమూర్తి చెప్పారు. తణుకు రోటరీ ఆడిటోరియంలో రాజ్యాగ ప్రచార వేదిక ఆధ్వర్యంలో జరిగిన 'సాంస్కృతిక వాదం- రాజ్యాంగ విలువలు' అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో కొప్పర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగ ప్రచార వేదిక కన్వీనర్ డీవీవీఎస్ వర్మ అధ్యక్షత వహించారు. కొప్పర్తి మాట్లాడుతూ దేశంలో నివశించే ప్రజలందరికీ చెందిన భారత ప్రాదేశిక జాతీయవాదానికి మెజారిటీ మతానికి మాత్రమే పరిమిత మైన జాతీయవాదానికి మధ్య సంఘర్షణ జరుగుతుందన్నారు. ఈ జాతీయ వాదం రాజ్యాంగ విలువలకు విరుద్ధమని చెప్పారు. భారత రాజ్యాంగం కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరికీ సమాన ప్రజాస్వామ్య హక్కులను కల్పించిందన్నారు. దేశ ప్రజలందరూ ఒక జాతిగా రూపొంద డానికి రాజ్యాంగం ప్రాతిపదికను ఇచ్చిందన్నారు. మెజారిటీ మత జాతీయ వాదం కేవలం అధికారం కోసం ప్రజలను విభజించి చేసే విధ్వంస రాజ కీయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిదన్నారు. మత పరమైన విభజన కోసం జరుగుతున్న చరిత్ర వక్రీకరణను ప్రతీఒక్కరూ తిప్పి కొట్టాలని చెప్పారు. కొప్పర్తి రాసిన 'చరిత్ర- జాతీయత సాంస్కృతిక ఆధిక్యం' పుస్తకాన్ని ఆవిష్క రించారు. డాక్టర్ బీ.రమేష్ చంద్రబాబు, పేరూరి మురళీకుమార్, అహ్మద్ రెహ్మాన్, ఆకుల వెంకటేశ్వరరావు, హుస్సేన్ అహ్మద్, మనోరమ పాల్గొన్నారు.



కోపల్లెలో వరిపొలాన్ని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కోపల్లెలో కేవీకే శాస్త్రవేత్తల పర్యటన

కాళ్ల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):కాళ్ల మండలంలోని కోపల్లె గ్రామంలో ఉండి కేవీకే శాస్త్రవేత్తల బృందం సోమవారం పర్యటించింది. కేవీకే శాస్త్రవేత్తలు అందించిన నూతన వరి రకం ఎంటీయూ 1212 క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో నూతన వరి వంగడం రకం కాలపరిమితి 140 రోజులని, సీజనల్‌గా వచ్చే తెగుళ్ళను తట్టుకుని అధిక దిగుబడి వస్తుందని వివరించారు. కాంప్లెక్స్ ఎరువులు వాడకూడదని, వాటి వల్ల జింకు, ఐరన్ లోపాలు వచ్చే అవకాశం ఉందన్నారు. నత్రజని, పొటాష్‌లను మాత్రమే వాడాలని సూచించారు. శాస్త్రవేత్తలు ఎన్.మల్లికార్జున రావు, శ్రీనివాసరావు, ప్రవీణ, రమేష్ నాయుడు, వీఏఏ మౌనిక పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడా పోటీలు

ఏలూరు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడంతో పాటు జాతీయ క్రీడా దినోత్సవంపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈనెల 29వ నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా జిల్లా, జోనల్ రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నన్నాయి. ఏలూరు జిల్లాలో 10 క్రీడా అంశాల్లో అండర్-22 పురుషులు, మహిళల జట్లకు ఈనెల 6 నుంచి పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోటీల్లో గెలుపొందిన జట్లను జోనల్ పోటీలకు ఎంపిక చేస్తారు. ఇక్కడ రాణించే క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో పోటీల్లో ఆడేందుకు అవకాశం కల్పించారు. ఈనెల 6న జంగారెడ్డిగూడెంలో ఆర్చరీ, ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో అథ్లెటిక్స్, ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బ్యాడ్మింటన్, ఏలూరు కండ్రికగూడెం బాక్సింగ్ అకాడమీలో బాక్సింగ్ పోటీలు జరగనున్నాయి. 7వ తేదీన అల్లూరి సీతారామ రాజు స్టేడియంలో బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, కోకో, వాలీబాల్, ఏలూరు ఇండోర్ సీతారామరాజు స్టేడియంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయి. ఈనెల 6, 7 తేదీల్లో జిల్లాస్థాయి పోటీలు, ఆగస్టు 11 నుంచి 14వ తేదీ వరకు జోనల్‌స్థాయి, 16 నుంచి 20 తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరుగనున్నాయి. వివరాలకు 98663 17326 నంబర్‌లో సంప్రదించవలసిందిగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు మండపాక విద్యార్థినులు



తణుకు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):చీరాలలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తణుకు రూరల్ మండలం మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఫణిశ్రీ తెలిపారు. ఆదివారం తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన జిల్లా అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలలో పాఠశాలకు చెందిన ఎం.నాగలక్ష్మీ లాంగ్ జంప్‌లో ప్రథమస్థానం, 600 మీటర్ల రన్నింగ్‌లో తేజారత్నం ప్రథమస్థానం, హైజంప్‌లో దివ్య శ్రీలక్ష్మీ ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను, వ్యాయామ ఉపాధ్యాయుడు సంకు సూర్యనారాయణలను సర్పంచ్ జానా వెంకటలక్ష్మీ, మండల టీడీపీ అధ్యక్షుడు ఆత్మకూరి రామకృష్ణ, ఉప సర్పంచ్ నగేష్, జనసేన నాయకులు శ్రీనివాసు, స్కూల్ ఛైర్మన్ గూడూరి మహాలక్ష్మీ తదితరులు అభినందించారు.

పెనుగొండ భాష్యం విద్యార్థులు ..



పెనుగొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):తణుకు చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పెనుగొండ భాష్యం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ వెంకట అప్పారావు తెలిపారు. విద్యార్థులు చీరాలలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

పోస్టు బేసిక్ స్కూల్ విద్యార్థిని ఎంపిక



పెంటపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు పెంటపాడు పోస్టు బేసిక్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన జి.చాందిని ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నారిపాటి రాజేష్ తెలిపారు. రన్నింగ్, లాంగ్ జంప్, షార్ట్‌పుట్ లో పోటీలలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కళింగ లక్ష్మణరావు, పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్థినిని అభినందించారు.

గల్ఫ్ నుంచి ఇండియాకు క్షేమంగా చేరిన మహిళ

కొయ్యలగూడెం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇండియాకు రాలేక గల్ఫ్‌దేశమైన కువైట్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మర్రిపూడి సుమ అనే మహిళ సోమవారం స్వగ్రామం చేరింది. గత నెల 27వ తేదీన 'మా అమ్మను భారత్‌కు రప్పించండనే' వార్త 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి ఆ మహిళను సోమవారం స్వగ్రామం బయ్యన్నగూడెం చేర్చారు. దీంతో ఆ మహిళ ప్రభుత్వానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపింది. దీనిపై టీడీపీ మండలాధ్యక్షుడు పారేపల్లి నరేశ్ మాట్లాడుతూ ఈ విషయాన్ని మంత్రి నారా లోకేశ్, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా నాయకులు స్పందించి ఈ మహిళను క్షేమంగా ఇండియాకు తీసుకొచ్చినట్టు తెలిపారు.

నిరసనల హోరు

» ధర్నాలతో దద్దరిల్లిన ఏలూరు, భీమవరం కలెక్టరేట్లు » సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సోమవారం వేర్వేరు సమస్యలపై పలువురు నిరసనలు చేపట్టారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములిచ్చిన తమకు పరిహారం చెల్లించాలని ఏలూరు కలెక్టరేట్ వద్ద రైతులు ఆందోళన చేశారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు అర్హత సాధించిన గిరిజన అభ్యర్థులకు ఉద్యోగాలివ్వాలంటూ విద్యార్థి సంఘాలు, నరసాపురంలో ప్రిన్సిపాల్ తీరుకు నిరసనగా విద్యార్థులు పాఠశాల గేటుకు తాళం వేసి ధర్నా చేశారు. మంచినీటి కోసం ఆకివీడు నగర పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలు.. భర్త నుంచి భార్యకు రక్షణ కల్పించాలని దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పనిచేయని ఫోన్లు వద్దంటూ అంగన్వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు.



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించిన దళిత ఐక్యవేదిక

భర్త నుంచి భార్యకు రక్షణ కల్పించాలి

భీమవరం టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):పెనుగొండకు చెందిన పడాల మీనాక్షి అనే గృహిణికి భర్త మునలయ్య నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయా లని దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ మునలయ్య, మీనాక్షిల వివాహమై 23 ఏళ్లు అయిందని, తొమ్మిదేళ్లుగా మీనాక్షిని వదిలేసి మానసికంగా వేధిస్తున్నారని, దీనిపై పెనుగొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా స్పందించ లేదని, దీనిపై ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డికి వినతి పత్రాన్ని అందించామని, మునలయ్య నుంచి గృహిణికి రక్షణ కల్పించాలని ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ సలీమా, జిల్లా ప్రెసిడెంట్ యల్లబిల్లి ఝాన్సీ, కొండేటి లాజర్, మాల మహానాడు జాతీయ కన్వీనర్ చీకటిపల్లి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.



మొగల్తూరు అంగన్వాడీ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన

అంగన్వాడీల ఆందోళన



ఏలూరు ప్రాజెక్టు కార్యాలయం వద్ద..

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద పనిచేయని ఫోన్‌లు వద్దని కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఏలూరు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఏలూరు జిల్లాలోని పెదపాడు, బుట్టాయగూడెం, చింతలపూడి, ముదినేపల్లి, కైకలూరు, పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలి

ఆకివీడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):మంచినీరు అందించాలని ఆకివీడు నగర పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో 14వ వార్డు మహిళలు నిరసన తెలిపారు. వార్డులో నాలుగు నెలలుగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదన్నారు. ఏఈ విజయ్‌కుమార్, తహసీల్దార్ నండూరి వెంకటేశ్వరరావుకు వినతులు అందించారు.



ఆకివీడు నగర పంచాయతీ కార్యాలయ ఏఈకి మహిళల అర్జీ



నరసాపురం పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

స్కూల్ వద్ద విద్యార్థుల ఆందోళన

నరసాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని నారాయణ స్కూల్ వద్ద సోమవారం విద్యార్థులు ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్ రాజీవ్ వైఖరి, స్కూల్‌లో మౌలిక వసతులు లేకపోవడం, టీచర్ల కొరతను నిరసిస్తూ విద్యార్థులు గేట్‌కు తాళం వేసి ధర్నా చేశారు. వీరి ఆందోళనకు సీపీఎం సంఘీభావం తెలిపింది. రెండు గంటలపాటు విద్యార్థులు ఆందోళన చేశారు. పోలీసులు స్కూల్ వద్దకు చేరుకున్నారు. ప్రిన్సిపాల్‌తో చర్చించారు. సమస్యల్ని పరిష్కారిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సీపీఎం నాయకుడు త్రిమూర్తులు పాల్గొన్నారు.



ఏలూరు కలెక్టరేట్ వద్ద గిరిజన కానిస్టేబుల్ అభ్యర్థుల నినాదాలు

కానిస్టేబుల్ నియామకాల్లో న్యాయం చేయాలి

ఏలూరు రూరల్/బుట్టాయగూడెం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ నియామకాల్లో తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన యువతీ యువకులు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కానిస్టేబుల్ ఎంపికలో అన్ని విభాగాల్లో తాము అర్హత సాధించినా ఉద్యోగం రాలేద ని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర జిల్లాల్లో 70 మార్కులు సాధిస్తే ఉద్యోగం ఇచ్చారని ఏలూరులో జిల్లాలో 80, 90, 100 మార్కులు వచ్చి నా ఉద్యోగం రాలేదని పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు అధికారు లు ముందు గోడు వెళ్లబోసుకున్నారు. నోటిఫికేషన్‌లో ప్రకటించిన విధంగా ఏజెన్సీకి పోస్టులు కేటాయించాలని, ఓపెన్ కేటగిరిలో రాకపోయినా ఎస్టీ రిజర్వేషన్‌లో తమకు అవకాశాలు తప్పకుండా రావాల్సి ఉండగా ఏజెన్సీ ప్రాంతంలో ఒక్క పోస్టును భర్తీ చేయలేదన్నారు. గిరిజన యువతతో పాటు ఏజెన్సీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు అధికారులను కలిసి న్యాయం చేయాలని కోరారు.



గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాసిత రైతుల ధర్నా

ఏలూరు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నిర్మాణం జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు కల్పించాలని, అండర్‌పాస్ బ్రిడ్జిలు, భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని, 2013 భూ సేకరణ చట్టాన్ని పటిష్టంగా అమలుచేసి భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత పోరాట కమిటీ, ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ధర్నా నిర్వహించారు. రైతులు కలెక్టరేట్ లోపలికి వెళ్ళేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ధర్నానుద్దేశించి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవేలో రైతులు పచ్చటి సారవంతమైన భూములను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు దేవరపల్లి సత్యనారాయణ, వామిశెట్టి హరిబాబు, కె నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులు గోలి సత్తిరెడ్డి, మందలపు నాగలింగం, కేవీవీ సత్యనారాయణ, ఐ.ప్రదీప్‌రాజు, అందుగుల మోహనరావు, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి కోన శ్రీనివాసరావు, బొడ్డు రాంబాబు, లావేటి సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో వైద్యుల నిర్లక్ష్యం

» వ్యక్తి మరణించిన ఎనిమిది గంటల తరువాత ఎమ్మెల్సీ ఇంటిమేషన్
» ఆస్పత్రి ముందు బంధువుల పడిగాపులు

ఏలూరు క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వ్యక్తి జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి తన జీవితాన్ని ముగించుకున్నాడు.మరణించిన వ్యక్తికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతను మరణించిన ఎనిమిది గంటల తరువాత పోలీసులకు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమాచారమిచ్చారు. ఎంత నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్నారో ఈ ఘటనే స్పష్టమవుతోంది. భీమవరం సమీపంలోని కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన మాణెం శివ ప్రసాద్(50)కు భార్య మధురశ్రీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తె డిగ్రీ చదువుతుండగా మరో కుమార్తె ఇంటర్మీడియట్ చదువుతోంది. శివ ప్రసాద్ ఒక మిక్చర్ బండి వద్ద పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఐదు నెలల క్రితం సైకిల్‌పై నుంచి పడిపోవడంతో అతడికి ఆపరేషన్ కూడా నిర్వహించారు. కుటుంబాన్ని తన కష్టంతో పోషించాల్సిన వాడిని తానే ఆ కుటుంబానికి బారంగా మారానని కుమిలిపోతూ తాను ఎప్పటికి ఆరోగ్యంగా కోలుకోలేని బాధతో జీవితంపైనే విరక్తి పెంచుకున్నాడు. చివరకు సోమవారం తెల్లవారుజామున ఇంటి వద్దే పురుగుల మందుతాగాడు. కుటుంబ సభ్యులు అతడిని తొలుత భీమవరం ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి సోమవారం ఉదయం 11.07 నిమిషాలకు తీసుకువచ్చారు. ఆసుపత్రిలోని ఇఎండి వార్డులో చేర్పించారు. 20 నిముషాల వ్యవధిలోనే అతను మృతి చెందాడు. సాధారణంగా ఎమ్మెల్సీ కేసుల్లో మరణించిన వెంటనే ఎమ్మెల్సీ ఇంటిమేషన్‌ను ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు అందిస్తారు. అక్కడ పోలీసులు సమాచారాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తారు. వారు వెంటనే ఆసుపత్రికి వచ్చి పంచనామా నిర్వహించి వైద్యులు చేత పోస్టుమార్టం జరిపించి మృత దేహాన్ని అప్పగిస్తారు. కానీ ప్రసాద్ 11.27 నిముషాలకు మరణిస్తే సోమవారం రాత్రి 7.20 నిమిషాలకు డెత్ ఇంటిమేషన్‌ను ఆసుపత్రి వైద్యులు, ఔట్‌పోస్టు పోలీసులకు అందించారు. ప్రసాద్ మరణించిన ఎనిమిది గంటల తరువాత ఇంటిమేషన్ అందించారు. దీంతో ఉదయం నుంచి ఆ కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్దే బిక్కుబిక్కుమంటూ తమ బంధువు మృత దేహం కోసం పడిగాపులుపడుతూనే ఉన్నారు. అక్కడ సిబ్బందిని అడిగితే వారు విసుక్కున్నారని వైద్యులు ఒకరిపై ఒకరు వంతులు వేసుకుని సంతకం పెట్టలేదని చెప్తున్నారు. మొత్తం మీద సోమవారం పోస్టుమార్టం జరగాల్సిన మృత దేహం చివరకు మార్చురీలోనే ఉంది. ఆ కుటుంబ సభ్యులు అన్నపానాలు కూడా ముట్టుకోకుండా నీరసించిపోయి మృతదేహం ఎప్పుడిస్తారో అంటూ దుఃఖంతో ఆస్పత్రి వద్దే రోదిస్తున్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఎన్నిసార్లు ఆసుపత్రి వైద్యులకు హెచ్చరికలు జారీ చేసినా తాము ఇంతేనంటూ విధులను నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు ఈ సంఘటనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ఇరువర్గాల ఘర్షణ.. ఇద్దరిపై కేసు

ఏలూరు క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా మరో యువకుడు అతి వేగంగా మోటారు సైకిల్‌పై వచ్చి తగిలాడు. దీంతో వారిమధ్య గొడవ జరిగింది. దీంతో ఇరువర్గాలు అర్ధరాత్రి దాడులకు తెగబడ్డారు. ధర్నా చేశారు. ఈ నేపథ్యంలో రెండు వర్గాలపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు చిరంజీవి బస్టాప్ ప్రాంతానికి చెందిన వల్లపు సాయికుమార్ తన స్నేహితుడితో మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా పోణంగి రోడ్డు జరుగులమ్మ గుడి ప్రాంతానికి చెందిన కాటూరి లక్కీ అనే బైక్ మెకానిక్ ఈ నెల 3వ తేదీ రాత్రి మోటార్ సైకిల్‌పై వేగంగా వెళ్తూ సాయికుమార్ మోటారు సైకిల్‌కు తగిలాడు. వీరి మధ్య మాటామాటా పెరిగి రెండు వర్గాలు ఘర్షణలకు దిగారు. ఒక వర్గం ఏలూరు పాతబస్టాండ్ వద్దకు వచ్చి కొద్దిసేపు ధర్నా చేశారు. పోలీసులు వెంటనే వారిని అక్కడ నుంచి పంపించి వేసి ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆలయ హుండీలో నగదు చోరీ

ఏలూరు క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):ఏలూరు గజ్జలవారి చెరువు సమీపంలో ఉన్న దాసాంజనేయ స్వామి గుడిలో హుండీ పగులగొట్టి సుమారు రూ.10 వేలు అపహరించుకుపోయారని ఫిర్యాదు అందడంతో ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గజ్జెలవారి చెరువు వద్ద ఉన్న దాసాంజనేయ స్వామి గుడిలో ఈనెల 3వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు హుండీ పగులగొట్టి సుమారు రూ.10 వేల నగదు అపహరించారంటూ ఆ గుడి కమిటీ సభ్యుడు కొల్లిపర బుద్ధ భగవాన్ కృష్ణ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫినాయిల్ తాగి వృద్ధుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వృద్ధుడు జీవితంపై విరక్తి చెందిన బాత్‌రూమ్‌లోని ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు కొత్తగూడేనికి చెందిన చేపల ప్రసాద్ (78) వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కొద్ది నెలల క్రితం సైకిల్‌పై నుంచి పడిపోవడంతో మక్కి ఆపరేషన్ చేశారు. అయితే అతను బాత్‌రూమ్‌కు కూడా కుటుంబ సభ్యులే తీసుకెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. ఈనెల 3వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులు బాత్‌రూమ్‌కు తీసుకెళ్లగా అక్కడ ఉన్న ఫినాయిల్ తాగి పడిపోయాడు. తీవ్ర అస్వస్థతకు గురైన ప్రసాద్‌ను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి దాటిన తరువాత మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పరుపుల తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం



ఏలూరు క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్యలో ఉన్న పరుపుల తయారీ కేంద్రంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సుమారు నాలుగు లక్షల విలువైన సోఫా సెట్లు, పరుపులకు సంబంధించిన మెటీరియల్ దగ్ధమైంది. ఏలూరు చేపల తూము సెంటర్‌లో వీనస్ డిజైనింగ్ బెడ్స్ అండ్ కుషన్స్ వర్క్స్ తయారీ కేంద్రాన్ని సరికొండ వెంకట సూర్యనారాయణ రాజు నిర్వహిస్తున్నారు. యథావిధిగా ఈనెల 3న రాత్రి తాళం వేసి వెళ్లిపోయారు. అర్ధరాత్రి దాటిన తరువాత అకస్మాత్తుగా మంటలు రావడంతో చుట్టుపక్కల వారు మేల్కొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వడంతో జిల్లా అదనపు అగ్నిమాపక అధికారి వి.రామకృష్ణ వారి సిబ్బందితో ఫైర్ ఇంజన్‌తో అక్కడికి చేరుకున్నారు. టూటౌన్ సీఐ అశోక్ కుమార్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని అతి కష్టం మీద మంటలను అదుపు చేశారు. సుమారు నాలుగు లక్షల రూపాయల విలువైన మెటీరియల్ దగ్ధమైనట్టు అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు.

కోడి వ్యర్థాల వ్యాన్ పట్టివేత.. ఇద్దరి అరెస్టు

ఏలూరు క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి కోడి వ్యర్థాలను మినీ లారీలో పెదపాడు మండల పరిధిలో ఉన్న చేపల చెరువుల వద్దకు తీసుకెళ్తుండగా ఏలూరు త్రి టౌన్ పోలీసులు మార్గమధ్యలో అదుపులోకి తీసుకున్నారు. పెదపాడునకు చెందిన వేగిరెడ్డి రామ్మోహనరావు, ఏలూరులోని గొల్లాయిగూడేనికి చెందిన గొల్లవరపు జాన్ కలిసి హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి కోడి వ్యర్థాలను మినీ లారీలో వేసుకుని సోమవారం తెల్లవారు జామున ఏలూరు రామకృష్ణాపురం బ్రిడ్జి మీదుగా వెళ్తుండగా త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వ్యాన్‌ను సీజ్ చేసి వారిద్దని అరెస్టు చేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఆచంట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలోని బాలంవారిపాలేనికి చెందిన గుడాల లక్ష్మీ నారాయణ ఈ నెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల ఎంతగా గాలించినా ఆచూకీ తెలియరాలేదు. భార్య జ్యోతి కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బీచ్‌లో ఇంజనీరింగ్ విద్యార్థి గల్లంతు

మొగల్తూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పేరుపాలెం బీచ్‌లో సెదతీరేందుకు వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థుల మిత్ర బృందంలో విషాదం నెలకొంది. భీమవరం బీవీరాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న పది మంది విద్యార్థులు సోమవారం సరదాగా పేరుపాలెం బీచ్‌కు వచ్చి సముద్ర స్నానానికి దిగారు. వీరిలో బి.తన్వీర్ అనే విద్యార్థి గల్లంతవడంతో పోలీసులు, అతని స్నేహితులు గాలింపు చర్యలు చేపట్టారు.

భార్యపై కత్తితో భర్త దాడి

జీలుగుమిల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):పి.రాజవరంలో భార్యపై భర్త కత్తితో దాడి చేయడంతో బాధితురాలు ఆస్పత్రి పాలైంది. గ్రామానికి చెందిన తెల్లం సింగరాజు, లక్ష్మి వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు. కొద్ది రోజులుగా సింగరాజు మద్యానికి బానిసయ్యి ఆస్పత్రిపాలవడంతో భార్య తెల్లం లక్ష్మి ఆస్పత్రిలో వైద్యం చేయించింది. ఆరోగ్యం కుదుటపడటంతో మళ్లీ సింగరాజు మద్యం తాగడం మొదలుపెట్టాడు. దీంతో భార్యభర్తల మధ్య సోమవారం వాగ్వాదం జరిగింది. ఆవేశంతో భార్య తలపై సింగరాజు కత్తితో నరికాడు. లక్ష్మి తీవ్రంగా గాయపడటంతో బంధువులు జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. తలపై పది కుట్లుపడ్డాయి. ఈ విషయమై ఎస్.ఐ. వి.క్రాంతికుమార్‌ను వివరణ కోరగా ఇంకా సమాచారం రాలేదని, ఆస్పత్రి నుంచి ఎమ్మెల్సీ రిపోర్టు రావాల్సి ఉందన్నారు.

కులం పేరుతో దూషించారంటూ ఫిర్యాదు

భీమవరం క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):తనను ముగ్గురు అధికారులు కులం పేరుతో దూషించారంటూ పట్టణానికి చెందిన కలిగితి మధు టూటౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి టూటౌన్ ఎస్ఐ కె.రామారావు తెలిపిన వివరాల ప్రకారం కలిగితి మధు 2008లో ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిలో చేరాడు. ఆ తర్వాత అటెండర్‌గా విధులు నిర్వహించాడు. తర్వాత మధును డ్రైవర్‌గా కొనసాగించారు. ఇదిలా ఉండగా 2021లో వి.సందీప్ ఐటీవోగా, ఎస్‌కె ఖాదర్ ఓఎస్‌గా, బి.మనోజ్‌కుమార్ ఎంటిఎస్‌గా విధుల్లో చేరారు. కొంత కాలం తర్వాత తాను డ్రైవింగ్ చేయలేనని అధికారులకు చెప్పడంతో వారు మధుపై కక్ష పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో కులం పేరుతో దూషించి 2022లో విధుల నుంచి తొలగించారు. అప్పటి నుంచి అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో సోమవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):రైలు పట్టాలు దాటుతున్న ఒక యువకుడిని ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వేలేరు గ్రామానికి చెందిన పొలగాని కృష్ణారావు(23) సోమవారం ఉదయం ఆ గ్రామ సమీపంలోని రైలు పట్టాల వద్ద బహిర్భూమికి వెళ్లాడు. విజయవాడ నుంచి విశాఖ వెళ్లే రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణారావు కొంత కాలంగా మానసికంగా బాధపడుతున్నాడు. ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎంఎస్ఎన్ ప్రసాద్, తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

డ్రోన్ కెమేరాతో పేకాట శిబిరంపై దాడి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):ఆధునిక సాంకేతికతను ఉపయోగించి డ్రోన్ కెమేరా ద్వారా జంగారెడ్డిగూడెం పోలీసులు పేకాట స్థావరాన్ని గుర్తించారు. మార్కెట్ యార్డు సమీపంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు ఎస్.ఐ. ఎస్.కె.జబీర్ డ్రోన్ కెమేరా ద్వారా పేకాట స్థావరాన్ని గుర్తించారు. పేకాడుతున్న వ్యక్తులు డ్రోన్ గుర్తించి పారిపోయే యత్నం చేశారు. దీంతో వెంటనే పోలీసులు పేకాట శిబిరం వద్దకు వెళ్లి నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4100 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ నిఘా పెట్టినట్టు డీఎస్పీ రవిచంద్ర తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు భీమడోలు విద్యార్థుల ఎంపిక

భీమడోలు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన భీమడోలు జడ్పీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు టి.స్వాతి తెలిపారు. ఇటీవల ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో ఎం.ఉమాలక్ష్మి, డి.జయలక్ష్మి, జె.యువసాయి నరసింహ, పి.వరాజ్‌గాంధీ రాజేష్‌లు వివిధ పోటీల్లో గెలుపొందారు. ఈ నెల 11వ తేదీ వరకు బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కుక్కునూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకులు కొన్నే లక్ష్మయ్య, సీపీఐ సహాయ కార్యదర్శి కోరాకుల బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘం గ్రామపంచాయతీ కార్మికులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పంచాయతీల్లో వెట్టిచాకిరి చేయించుకుంటూ కార్మికుల బాగోగులను పట్టించుకోకుండా ప్రభుత్వాలు గాలికి వదిలేశాయని విమర్శించారు.

హెచ్ఐవీపై క్విజ్ పోటీ.. జిల్లా స్థాయి విజేతలు వీరే

ఏలూరు అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహనకు ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు సోమవారం రెడ్ రిబ్బన్ క్లబ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఏపీ సాక్స్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన జి.సుమనశ్రీ, ఎం.సుశాంత్‌లకు ప్రథమ బహుమతి, కైకలూరు ప్రభుత్వ కళాశాలకు చెందిన టి.తన్మయి, డి.దేవిహర్షిణిలకు ద్వితీయ, చింతలపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎస్.కె.సహేరా, ఎస్.మౌనికలకు తృతీయ బహుమతి లభించాయి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని త్వరలో అందజేస్తామని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ నరేంద్రకృష్ణ తెలిపారు.జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి శేఖర్‌బాబు, ఆర్ఐవో యోహాన్, ఏపీ సాక్స్ ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల క్లస్టర్ మేనేజర్ ఆదిలింగం, క్లినికల్ సర్వైలెన్స్ ఆఫీసర్ హరినాథ్ కుమార్, దిశ బృందం సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్జాతీయ సదస్సు

ఏలూరు అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పునరుత్తేజ, రూపాంతర భారతదేశ సుస్థిరాభివృద్ధికి లక్ష్యాలనే అంశంపై మంగళ, బుధవారాల్లో ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తెలిపారు. కెన్యాదేశం తుర్ఖానా విశ్వవిద్యాలయం, గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ఇక్ఫాయ్ యూనివర్సిటీ, తదితర విశ్వవిద్యాలయాలు, దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని కళాశాలల నుంచి ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధకులు హాజరవుతారని వివరించారు.

హాస్టల్స్ సమస్యలపై కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ వినతి

ఏలూరు అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):ఇటీవల కూలిపోయిన భీమడోలు మండలం పోలసానిపల్లి డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల తరగతి గదుల స్థానంలో కొత్తగా నిర్మించే వరకు తాత్కాలికంగా రేకుల షెడ్లు నిర్మించాలని అభ్యర్థిస్తూ సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేసినట్టు ఎస్ఎఫ్ఐ జిల్లాల కార్యదర్శి కె.లెనిన్ తెలిపారు. అలాగే ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్ సమీపంలోని ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహం విద్యార్థులు మాదకద్రవ్యాలకు లోనయ్యారని గతవారం సాక్ష్యాధారాలతోసహా అందజేసినా అధికారులు ఇంత వరకు హాస్టల్‌ను సందర్శించకపోవడం పట్ల ఎస్ఎఫ్ఐ నాయకులు లెనిన్ ఆక్షేపించారు. హాస్టల్ నిర్వహణపై పోలీసులు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు నిఘాపెట్టాలని డిమాండ్ చేశారు.వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మనోజ్, సభ్యుడు సూర్యభాను ఉన్నారు.

10 నుంచి ధర్మాజీగూడెంలో శిక్షణ తరగతులు

ఏలూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చెయ్యాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. ధర్మాజీగూడెంలో ఆయన స్థానిక వ్యవసాయ కార్మిక సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు.శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వ్యవసాయ రంగంలో కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. వ్యవసాయ కార్మికులకు భూమి, ఇళ్ళు, తదితర సమస్యలతో పాటు పంటలకు మద్దతు ధరపై ఈ శిక్షణ తరగతుల్లో చర్చిస్తామన్నారు. పలువురు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ వాణిజ్య దినోత్సవం

చింతలపూడి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ వాణిజ్య దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆధునిక వ్యవస్థలో వాణిజ్యం ప్రాముఖ్యతను వివరించారు. ఆర్థికాభివృద్ధికి వాణిజ్యమే వెన్నుముక అని, ఈ రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. ఇ-కామర్స్, ఆన్‌లైన్ ప్లాట్ ఫారాలు వ్యాపార పద్ధతులను ఎలా మారుస్తున్నాయో, పారిశ్రామిక వేత్తలకు కొత్త అవకాశాలు ఎలా కల్పిస్తున్నాయో వివరించారు. అంతర్జాతీయ వాణిజ్యం, ప్రపంచ వాణిజ్య విధానాలు, ఆర్థిక వ్యవస్థలపై ఎలా ప్రభావం చూపిస్తాయో వివరించారు.

'ఉచితంగా సోలార్ విద్యుత్ ప్లేట్లు అమర్చుకోండి'

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ కోరారు. 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించే ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా సోలార్ విద్యుత్ ప్లేట్లను అమర్చుకునే అవకాశం ఉందని టీడీపీ సీనియర్ నాయకుడు పరిమి సత్తిపండు, ఎస్సీ సెల్ నాయకుడు పాతూరి అంబేడ్కర్, ఎస్టీ సెల్ నాయకుడు కంపా రాజేంద్ర తెలిపారు. సోమవారం పట్టణ టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాష్ట్ర క్షత్రియ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్లు నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, జి.ప్రసాద్, కె.రాంబాబు, కె.చంటి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిరోధించండి

ఏలూరు క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా నిరోధించాలంటే ముందుగానే గ్రామ, వార్డు సంరక్షణ కార్యదర్శుల సమాచారం సేకరించే బాధ్యత ఉందని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు మాట్లాడుతూ సైబర్ నేరాలపై సోషల్ మీడియా వేదికగా అవగాహన కల్పించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారమిస్తే పది నిమిషాల్లోపు పోలీస్ సహాయం అందుతుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసులు, సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి సీఐటీయూ కృషి

కుక్కునూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పోరాటానికి సీఐటీయూ కృషి చేస్తోందని ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ అన్నారు. సోమవారం కుక్కునూరులో సీఐటీయూ 7వ మండల మహాసభ జరిగింది. కార్మికుల సమస్యలపై నిరంతరం అలుపెరగని పోరాటాలు సీఐటీయూ చేస్తుందన్నారు. సమాన పనికి సమానవేతనాలు ప్రభుత్వాలు ఇవ్వకపోవడంతో చాలిచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికులను సీఐటీయూ ఐక్యం చేస్తుందన్నారు. సీఐటీయూ భవిష్యత్తు కార్యాచరణ కోసం ప్రతీ మూడేళ్లకు ఒకసారి మహాసభ నిర్వహిస్తుందని తెలిపారు.

ట్రిపుల్ ఐటీలోకి అక్షయపాత్ర !

(5వ పేజీ తరువాయి)

మెస్‌ల్లో భోజన సదుపాయాలు చేసేందుకు ప్రస్తుతం ఉన్న కిచెన్లు తమకు పనికి రావని, తమకు అనుగుణంగా కిచెన్‌లను తామే ఏర్పాటు చేసుకుంటామని, అందుకు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఎకరం భూమిని తమకు ఇవ్వాలని అక్షయపాత్ర సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అలా తమకు భూమి ఇస్తే ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.2 కోట్ల వరకు తమకు ఇచ్చేందుకు ఆయా క్యాంపస్‌ల పరిధిలోని ఎంపీలు సిద్ధంగా ఉన్నారని, మిగిలిన మొత్తం తమ సంస్థ బరాయించి, మెస్‌లకు అవసరమైన షెడ్లను, కావాల్సిన పరికరాలను ఏర్పాటు చేసుకుంటామంటూ ప్రభుత్వానికి ప్రతిపాదించినట్టు సమాచారం.

మెప్మాకు మాంసాహారం బాధ్యత

ట్రిపుల్ ఐటీల్లో విద్యార్థులకు మెప్మా ద్వారా మాంసాహారం భోజనం అందించేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఫుడ్ కోర్ట్‌ను మెప్మా పరిధిలో నిర్వహిస్తుండగా, ఇదేవిధంగా నాలుగు క్యాంపస్‌లలోనూ మాంసాహార భోజనాన్ని మెప్మా ద్వారా అందించేందుకు ముందుకు వస్తున్నట్టు అధికార పార్టీ నేతలు అడుగులు వేస్తున్నారు.

నైరుతి..!

(5వ పేజీ తరువాయి)

నిడమర్రు మైనస్ 60.6, మండవల్లి మైనస్ 26.1, కలిదిండి మైనస్ 1.7, ముదినేపల్లి మైనస్ 23.2, ఏలూరు అర్బన్ మైనస్ 51.6, చింతలపూడి మైనస్ 26.1, లింగపాలెం మైనస్ 41.5, చాట్రాయి మైనస్ 19, ముసునూరు మైనస్ 6.1, నూజివీడు మైనస్ 46.9, ఆగిరిపల్లి మైనస్ 3.7 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి. జూన్, జూలై నెలలు కలిపి మొత్తం వర్షపాతం పరిశీలిస్తే జిల్లాలోని 12 మండలాల్లో సాధారణం కన్నా మించి వర్షపాతాలు నమోదు కాగా 16 మండలాల్లో మైనస్ వర్షపాతాలు నమోదయ్యాయి. ఈ రెండు నెలల్లో కలిపి మొత్తం సాధారణ వర్షపాతం 354 మిల్లీ మీటర్లు కాగా 370 మి.మీ వర్షపాతం నమోదైంది. అయితే వర్షం కురిసిన ప్రాంతాల్లో మాత్రమే వర్షం కురుస్తోంది. వర్షం కావాల్సిన ప్రాంతాల్లో వర్షం అంతంతమాత్రంగానే కురుస్తోంది. దీంతో సార్వా సాగులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

యాప్‌లతో వేగలేం..

- జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల ఆవేదన
- నెట్‌వర్క్ సమస్య వేధిస్తోందని ఆందోళన
- కార్యాలయాల్లో ప్రభుత్వ ఫోన్ల సరెండర్

పెదపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో విధి నిర్వహణలో వినియోగించేందుకు గాను తమకు అందజేసిన ఫోన్లు సరిగా పనిచేయడం లేదని, సిగ్నల్స్ లేకపోవడం, యాప్‌లు ఓపెన్ కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తూ పెదపాడు ఐసీడీఎస్ పరిధిలోని పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు తమకు సంబంధించిన ఫోన్లను పెదపాడు సీడీపీవో కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఫోన్లు అందజేసేందుకు కార్యాలయానికి రాగా సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది ఎవరూ తమకు సహకరించలేదని ఆరోపించారు.కార్యాలయంలో ఉన్న టేబుల్‌పై అట్టపెట్టెల్లో ఫోన్లు భద్రపరిచామన్నారు. పెదపాడు ఐసీడీఎస్ పరిధిలోని మూడు మండలాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ప్రభుత్వం యాప్‌ల పేరుతో పనిభారం మోపడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం బుట్టాయగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పని చేస్తున్న అంగనవాడీ వర్కర్లు ఫోన్లను కార్యాలయానికి సరెండ్ చేశారు. సిగ్నల్‌లేని ప్రాంతాల్లో ఇబ్బందులు పడుతున్నామని, నిబంధనల కారణంగా సకాలంలో సేవలు అందించలేకపోతున్నామని వాపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ పిలుపు మేరకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లను కార్యాలయానికి ప్రాజెక్టు పరిధిలో 188కేంద్రాల నుంచి ఫోన్లు అందజేశామన్నారు.

● చింతలపూడి: పనిచేయని ఫోన్‌లు మాకొద్దని ఐసీడీఎస్ పీవోకు అంగన్‌వాడీ కార్యకర్తలు సెల్‌ఫోన్లను



ప్రభుత్వమిచ్చిన ఫోన్లు అప్పగిస్తున్న అంగన్‌వాడీలు

సరెండర్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ జిల్లా నాయకులు టి.మాణిక్యం, ప్రాజెక్టు అధ్యక్షురాలు సరోజిని మాట్లాడుతూ యాప్‌ల కారణంగా అంగన్‌వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అన్ని యాప్‌లు కలిపి ఒక యాప్‌గా మార్పు చేయాలని, ఎఫ్ఆర్ఎస్, ఇన్-అవుట్ రద్దు చేయాలని, సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు, 5జీ నెట్‌వర్క్ ఇవ్వాలని కోరారు. ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి సెక్టార్ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దాతల సాయం

ద్వారకాతిరుమల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి దాతలు భాగస్వాములవడం శుభపరిణామం అని శ్రీవారి దేవస్థానం ఈవో, పాఠశాల కరస్పాండెంట్ ఎన్వీ సత్యనారాయణ మూర్తి అన్నారు. ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న సంస్కృతోన్నత పాఠశాలలో 6నుంచి 10వ తరగతి వరకు చదివే 285 మంది విద్యార్థులకు ముగ్గురు దాతలు సుమారు రూ.7.09 లక్షల విలువైన యూనిఫామ్స్, బ్యాగ్స్, బెల్టులు, పుస్తకాలు అందజేశారు. హైదరాబాద్ కాప్రా ప్రాంతానికి చెందిన కందాడై శ్రీనివాసాచారి రూ.5.44 లక్షల విలువైన యూనిఫాంలు, బ్యాగులు, బెల్టులు, ఉంగ్రాజవరం మండలానికి చెందిన మల్లెన రంగారావు, మల్లెన శేషగిరిరావులు రూ.1,65,118 విలువైన పాఠ్యపుస్తకాలు, బుక్స్ అందించారు. వీటిని ఈవో మూర్తి విద్యార్థులకు అందించి దాతలను అభినందించారు.

కండీషన్ లేని బస్సులతో ఇక్కట్లు

ద్వారకాతిరుమల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కండీషన్‌లో లేని స్కూల్ బస్సులు విద్యార్థుల పాలిట శాపంగా మారాయి. ఎప్పుడు ఎక్కడ ఆగిపోతాయో తెలియని బస్సులు రోడ్లపైకి వస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే దీనికి కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కామవరపుకోటకు చెందిన ఓ స్కూల్ బస్సు ద్వారకాతిరుమలలో విద్యార్థులతో వెళ్తూ సూపర్‌బజార్ సెంటర్‌లో నిలిచిపోయింది. రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో స్థానికులు దానిని పక్కకు నెట్టారు. అది రిపేరు చేసిన తర్వాత తిరిగి విద్యార్థులతో స్కూల్‌కు బయల్దేరింది.

నలుగురికి కానిస్టేబుల్ ఉద్యోగాలు

పోలవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో నలుగురు యువకులు పోలీస్ సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక పట్ల సోమవారం పలువురు ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు. మండలంలో పోలవరం గ్రామానికి చెందిన నంద్యాల సూర్యతేజ 145 మార్కులు, బల్లం చిన్ని మణి కృష్ణ కాంత్‌రాజు 130 మార్కులు, పట్టిసీమ గ్రామానికి చెందిన పూడి మహేష్ 122 మార్కులు, బోడసింగి సుబ్రహ్మణ్యం 122 మార్కులు సాధించి ఏపీఎస్సీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల్లో విజయం సాధించారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో మండలానికి చెందిన ఈ నలుగురు యువకులు ఎంపిక కావడం పట్ల పలువురు గ్రామపెద్దలు, గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులు యువకులకు శుభాకాంక్షలు తెలిపారు.

పోక్సో చట్టంపై అవగాహన

పోలవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):పట్టిసీమ జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పోలవరం పోలీసులు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. మీరక్షణ-మాకర్తవ్యం శక్తి యాప్‌పై అవగాహన, మాదక ద్రవ్యాల దుర్వినియోగం నివారణ, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్, కెరియర్ గైడెన్స్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ బాలసురేష్ బాబు, ఎస్ఐ పవన్ కుమార్,మహిళా పోలీస్ నాగలక్ష్మి ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

ఏలూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలం ధర్మాజీగూడెనికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మోరంపూడి రాజా (63) సోమవారం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. సుదీర్ఘకాలంగా టీడీపీకి కట్టుబడి పని చేశారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్ ధర్మాజీగూడెం గ్రామానికి వెళ్లి మోరంపూడి రాజా మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజా కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

నేడు విగ్రహ పునఃప్రతిష్ఠ

పెదపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక బళ్లరేవుతూం సెంటర్‌లో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి, భక్తాంజనేయస్వామి వార్ల ఆలయాల్లో విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కనకదుర్గమ్మ, భక్తాంజనేయ స్వామి వార్ల విగ్రహాలను ట్రాక్టరుపై ఉంచి గ్రామ పుర వీధుల్లో సోమవారం ఊరేగింపు నిర్వహించారు. 5న దుర్గాదేవి ప్రతిష్ఠ, మండపారాధన, జలవాసం, ధన్యవాస కార్యక్రమాలు, 6న భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, సాయంత్రం శివ పార్వతుల కల్యాణం జరుగుతాయన్నారు. కావున భక్తులంతా స్వామి, అమ్మవార్ల విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

భీమడోలు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఉచిత పథకాల పై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించేందుకు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తోందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు.భీమడోలులోని వెలుగు సమైఖ్య కార్యాలయానికి వచ్చిన ఆయన జాగృతి పథకంలో భాగంగా ఉచిత న్యాయ, సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించి మహిళల రక్షణ చట్టాలను తెలియజేశారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దోమల నిర్మూలనపై అవగాహన

దెందులూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఏలూరు జిల్లా మలేరియా అసిస్టెంట్ అధికారి జే.గోవిందరావు అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని పెదవేగి మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎస్సీ కాలనీలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఆరోగ్యశాఖ అధికారులు నాగమణి, రమేశ్,శ్రీనివాసరావు, వేణు, ప్రసాద్, పద్మావతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

కామవరపుకోట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జోగడిగూడెం గ్రామంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.వి.ఎల్. మంగాదేవి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మంగాదేవి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రిపాలివ్వడం ద్వారా ఆ బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఐసీడీఎస్ ప్రాజెక్టు సూచనలు పాటించాలని తెలిపారు. అంగన్‌వాడీలు, గ్రామస్థులు, మరియలక్ష్మి పాల్గొన్నారు.



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

వైసీపీది అనాలోచిత పాలన

ఏలూరుటూటౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం ఓ యజ్ఞంలా సాగుతోందన్నారు.

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దు

కామవరపుకోట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై స్మార్ట్ మీటర్ల పేరుతో భారం వేయడం సరికాదని సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు పేర్కొన్నారు. సోమవారం కామవరపుకోటలోని పలు వార్డుల్లో సీపీఐ నాయకులు, కార్యకర్తలు అవగాహన ర్యాలీని నిర్వహించారు. మంగళవారం విద్యుత్ కేంద్రాల వద్ద జరిగే ధర్నాలో వినియోగదారులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నాయకులు కంకిపాటి బుచ్చిబాబు,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుమ్మడి లక్ష్మీనారాయణ, కొండేపూడి అన్నమేరి చంద్రమ్మ, కె.రజిని పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

దెందులూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):గోపన్నపాలెం గ్రామంలోని కోదండ రామలయంలో శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయ, గణేష్ సుబ్రహ్మణ్యం, శ్రీకృష్ణ, ఆయ్యప్ప స్వామి, వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్‌లతో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఆలయ నిర్వాకులు ఏనుగు వెంకటేశ్వరరావు, ఏనుగు అచ్చారావు, కేబుల్ శ్రీను, చింతా సుబ్బారావు, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

శివాలయాల్లో హోరెత్తిన పూజలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలోని రెండవ సోమవారం కావడంతో నగరంలోని పలు డివిజన్లలోని శివాలయాల వద్ద భక్తులు విశేష పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ మేరకు ఆలయాల వద్ద శివ భక్తుల సందడి నెలకొంది. శివ పూజలతో హోరెత్తింది. శివనగర్‌లోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, దక్షిణపువీధిలోని మార్కండేయ స్వామి, జరాపహరేశ్వరస్వామి, అగ్రహారంలోని పాత శివాలయం, నగరేశ్వరాలయం, పవరు పేటలోని కాశీ విశ్వేశ్వరాలయం, సత్యనారాయణపేటలోని రేవులింగేశ్వరాలయం, నాగేశ్వరపురం, బావిశెట్టివారిపేటల్లోని కాశీ విశ్వేశ్వరాలయాల వద్ద, పత్తేబాదలోని చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద, దుర్గా చెన్నమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద, మినీ బైపాస్ రోడ్డులోని భవాని సమేత విశ్వంభరేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు శివపూజలతో హోరెత్తించారు.

పంటల నమోదుపై అవగాహన

పోలవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇ-పంట నమోదుపై మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయంలో సోమవారం అవగాహన కల్పించారు. గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామస్థాయి రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఖరీఫ్ 2025 సీజన్‌కి సంబంధించి ఇ-పంట నమోదుపై శిక్షణనిచ్చారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ పంట పేరు, రకం, విత్తిన తేదీ, నీటి పారుదల వనరుల వివరాలు తప్పక నమోదు చేయించుకోవాలని అన్నారు. పంట సాగు లేని పక్షంలో నో క్రాప్ నమోదు చేయాలని సూచించారు. తహసీల్దారు సాయిరాజు, డీటీ కె శ్రీనివాస్, ఏఎస్‌వో నవత పాల్గొన్నారు.

కార్మిక వర్గం కోసం పోరాటం

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు సమరశీల పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ అధ్యక్షత వహించారు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోదీ సర్కార్ ప్రవేశపెట్టిన సరళీకరణ విధానంలో రాష్ట్రంలో కూటమి సర్కార్ పది గంటల పని దినాలను ప్రవేశపెట్టడం సరికాదన్నారు. కార్మికులను చైతన్యం చేసే దిశగా ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు ఏలూరులో రాష్ట్ర స్థాయి తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లా ఆఫీస్ బేరర్స్, కమిటీ సభ్యులు ఎస్.రామ్మోహన్, దాన వర ప్రసాద్, యర్రా శ్రీనివాసరావు, గ్రీష్మ కుమార్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

ఏలూరు క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కల్గించేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ హెచ్చరించారు. ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇరు వర్గాలు ఘర్షణ పడిన కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న రాత్రి కాటూరి లక్కీ(19) అనే యువకుడిని పోణంగి రోడ్డు జరుగులమ్మ గుడి ప్రాంతంలో చిరంజీవి బస్టాప్ ప్రాంతానికి చెందిన పల్లెపు సాయికుమార్, తురకా మురళీ, గుంజే జాన్‌లు అడ్డగించి మోటార్ సైకిల్‌ను చూసుకుని నడపాలని, లేదంటే తమను ఢీకొట్టే వాడివంటూ తిట్టారు. ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసులు నమోదు చేసినట్టు డీఎస్పీ చెప్పారు. ఓ యూట్యూబర్ చేసిన ఆరోపణల్లో నిజం లేదని, నిందితులు ఏ పార్టీకి చెందిన వారు కాదని డీఎస్పీ స్పష్టం చేశారు. వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, టూటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, రూరల్ ఎస్ఐ నాగబాబు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలి

- విద్యార్థులకు ఎస్పీ కిశోర్ దిశానిర్దేశం

పెదపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల కలలను నేరవేర్చడానికి విద్యార్థులు శ్రమించాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప శివకిశోర్ అన్నారు. పెదపాడు మండలం వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతుల ప్రారంభం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ కె.ప్రతాప శివ కిశోర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మరికొందరు విద్యార్థులకు ఒక మార్గదర్శిగా నిలవాలన్నారు. సాంకేతికపై అవగాహన పెంచు కోవాలన్నారు.అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల చదువులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి సూచనలు చేశారు. సీఆర్‌రెడ్డి కళాశాల యజమాన్యం, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పేదల ఇళ్ల పేరుతో దోచేశారు

- గత వైసీపీ పాలకులపై ఎమ్మెల్యే ఆగ్రహం

దెందులూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్లు ఇస్తామంటూ కాలనీల పేరిట కమిషన్ల దోచేశారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ధ్వజమెత్తారు. గోపన్నపాలెం పంచాయతీ పరిధిలోని వేగవరం జగనన్న కాలనీకి రోడ్డు కూడా లేదన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లుబాబు) ఈ కాలనీ ప్రజల కష్టాలు తెలుసుకుని, క్రిస్టియన్ సంస్థ(సిస్టర్స్) నిలయానికి చెందిన స్థలంలో రోడ్డు వేసేందుకు చింతమనేని వారిని ఒప్పించారు. బీటీ రోడ్డు నేనే వేయిస్తానని అక్కడ ప్రజలకు హామీ ఇచ్చారు. తమ బాధలు పట్టించుకుని రోడ్డుకు మోక్షం కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ కాలనీకి చింతమనేని కాలనీగా నామకరణం చేయడానికి గ్రామస్తులంతా మిల్లుబాబు ఆధ్వర్యంలో తీర్మానించారు. ఎంపీడీవో కంతేటి శ్రీదేవి, తహసీల్దార్ సుమతి, టీడీపీ గ్రామాధ్యక్షులు చింతా సుబ్బారావు, యూనిట్ ఇన్‌చార్జి మారగాని సత్యనారాయణ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు


రామాలయ పునర్నిర్మాణానికి విరాళం

పోలవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పాతపోలవరం గ్రామంలో పురాతన రామాలయ పునర్నిర్మాణానికి సోమవారం దాతలు విరాళం అందజేశారు. భీమవరం మండలం తాడినాడ గ్రామానికి చెందిన దాత గాదిరాజు శరత్ రాజు, సుకన్య దంపతులు రూ.50 వేలు, వైజాగ్ వాసులు గోలి గణేశ్ దంపతులు రూ.25 వేలు ఆలయ కమిటీ సభ్యులు దేవాబత్తుల నాగదేవికి అందజేశారు. దాతల విరాళాలతో కలిపి రూ.2 లక్షలను ఆలయ పునర్నిర్మాణానికి ఉపయోగించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు సూరవరపు వీరన్న, బొడ్డు రాంబాబు, గుల్లిపల్లి శివ, దేవాబత్తుల నాగరాజు, దేవాబత్తుల రాంబాబు, పట్నాల నారాయణరావు, సూరవరపు తాతయ్య, అప్పారావు, సూరిబాబు, సురేష్, కిరణ్, రంగా అయ్యప్ప పాల్గొన్నారు.

మోయలేని పని భారం..

- ఆరు మండలాలకు ఒక్కరిదే బాధ్యత
- ఉద్యాన శాఖాధికారికి తప్పని పాట్లు
- సుపరిపాలన పర్యటనలో తిరగలేక పాట్లు
- మండలానికి ఒకరిని నియమించాలని వినతి

దెందులూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఉద్యాన వన శాఖాధికారుల కొరత ఒకే ఒక్కడిపై తీరని భారం.. శాపంగా పరిణమిస్తోంది. వ్యవసాయంతో పాటు ఉద్యాన రంగం వైపు రైతులను ప్రోత్సహిస్తున్న అధికారులు భర్తీవైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. దెందులూరు మండల కేంద్రంగా పని చేస్తున్న ఉద్యాన శాఖాధికారి బుడిజగ్గుల కరణ్ ఉద్యోగ భారంతో సతమతమవుతున్నారు. ఒక్క మండలమే పూర్తి స్థాయిలో బాధ్యతలు కష్టమవుతున్న నేపథ్యంలో ఈయనకు అదనంగా పెదపాడు, ఏలూరు రూరల్, కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లితో సహా ఆరు మండలాలకు ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. దీనికి అదనంగా గోపన్నపాలెంలో ఉద్యాన వన అభివృద్ధి క్షేత్రంలో రైతులకు అవసరమైన మొక్కలను పెంచాల్సి ఉంటోంది. వాస్తవంగా ఈ క్షేత్రానికి ఒక అధికారి ఉండాల్సి ఉండగా, అధికారుల కొరత కారణంగా ఈయనే మోయలేని భారం మోస్తున్నారు. ఇలా ఉంటే ఉద్యానవన పంటల విస్తరణ, ఈ- పంటల నమోదు, నిమ్మ, కొబ్బరి, అరటి, జీడి మామిడి తదితర పంటలకు రైతుల్లో బీమా చేయించడంతో పాటు జాతీయ నూనె గింజల విస్తరణ పథకం, ఉద్యాన సమీకృత పథకం, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కొబ్బరి అభివృద్ధి బోర్డుతో, రైతుల అవసరమైన డ్రిప్ రాయితీలు కూడా పర్యవేక్షించాల్సి ఉంది. గతేడాది ప్రధాన మండలంతో కలిపి ఏడు మండలాల బాధ్యతలు బుడిజగ్గుల కరణ్‌కు ఇవ్వడంతో పర్యవేక్షణ భారంగా మారింది. సుపరిపాలనలో తొలి అడుగు ఆయా మండలాల్లో జరిగినప్పుడు అన్ని చోట్ల హాజరుకాలేని పరిస్థితి..ఎమ్మెల్యేల పర్యటనలో హాజరుకాలేని కారణంగా మాటలు పడుతున్నట్లు తెలిసింది. కనీసం ఒకే నియోజకవర్గంలో రెండు మండలాలకు కలిపి ఒక అధికారి నియమించినా కొంత వెసులుబాటు ఉంటుందని చెబుతున్నారు. దీని వల్ల రైతులు ఉద్యానవన పంటల విస్తరణపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుందని తెలుస్తోంది. ఇప్పటికైనా ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రైతుల సౌకర్యార్థం మండలాలకు ఉద్యాన శాఖ అధికారులు నియమించాలని రైతులు కోరుతున్నారు.



ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయాలి

వేలేరుపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ దినోత్సవాన్ని ఈ నెల 9న ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని ఆదివాసీలంతా ఏకమవ్వాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు చోడే సీతారామయ్య పిలుపునిచ్చారు. సోమవారం చిన్నబొర్రతోగు గ్రామంలో ఆదివాసీల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆదివాసీల అభివృద్ధి కోసం కల్పించబడ్డ చట్టాల గురించి ప్రతీఒక్కరికి అవగాహన ఉండాలని నాయకులు పేర్కొన్నారు.

కుట్టు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ల అందజేత

కొయ్యలగూడెం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చ అధ్యక్షురాలు బొల్లిన నిర్మలకిషోర్ కోరారు. సోమవారం మండలంలోని బయ్యన్నగూడెంలో తపనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ శిక్షణనిచ్చారు. దీంతో ఆ మహిళకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని, కుట్టుమిషన్ల శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ శిక్షణ ఇస్తున్న తపనా ఫౌండేషన్ వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు, మద్దు బాలనాగేశ్వరరావు, ఎస్ఆర్ఆర్ సుభద్రాదేవి, వీరవరపు నివాస్ పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఆగిరిపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండల పరిషత్ సమావేశం ఈ నెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి. భార్గవి తెలిపారు. ఎంపీపీ గోళ్ళ అనూష అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్తు కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కోరారు.

300 మందికి ఉచిత వైద్య పరీక్షలు

కలిదిండి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కలిదిండి సుగుణ డిగ్రీ కళాశాలలో సుగుణ సంస్థల అధినేత కె.హరినాథ్ స్మృత్యర్థం సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పేదలు, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కరస్పాండెంట్ కె.రాజమణి, ప్రిన్సిపాల్ టి.వెంకటేశ్వరరావు, వైద్యులు తన్మయి, సుజన్మయి పాల్గొన్నారు.



చాట్రాయి మండల పరిషత్ కార్యాలయం

ఒక్క ఉద్యోగే విధుల నిర్వహణ!

చాట్రాయి మండల పరిషత్ కార్యాలయం తీరిది..

చాట్రాయి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బదిలీలు, సెలవుల కారణంగా చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో కేవలం ఒక్క ఉద్యోగే విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు, సిబ్బంది లేకపోవటంతో పనులు జరక్క ప్రజలు, ప్రజాప్రతినిదులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 6 నెలల క్రితం ఎంపీడీవో మంగాకుమారి బదిలీ కాగా, ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ విజయలక్ష్మి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఏవో కమలా విష్ణు, సీనియర్ అసిస్టెంట్ సీతా రామారావు 2 నెలల క్రితం బదిలీ అయ్యారు. వీరి స్థానంలో ఎవరూ చేరలేదు. ఇటీవల ఇన్‌చార్జి ఎంపీడీవో విజయలక్ష్మి అస్వస్థతకు గురి కావటంతో సెలవు పెట్టారు. జూనియర్ అసిస్టెంట్ నవ్య మాత్రమే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో మారుమూల మండలం కావటంతో ఇక్కడి నుంచి వెళ్ళేవారే కానీ వచ్చేవారు లేక ఈ పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి మండల పరిషత్ కార్యాలయంలో ఖాళీలు భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల తప్పిదంతో పెన్షన్ కోల్పోయా..



కొసరాజు సరోజిని, కోటపాడు

చాట్రాయి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తన భర్త కొసరాజు రాధాకృష్ణ 20 నెలల క్రితం చనిపోగా, హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో ఆయన పేరును అధికారులు తొలిగించకపోవటంతో తనకు స్పౌజ్ పెన్షన్ మంజూరు కావటం లేదని మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన వృద్ధురాలు కొసరాజు సరోజిని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఏవో కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. తన భర్త 2023 నవంబరు 9న చనిపోయారని, ఆయన వృద్ధాప్య పెన్షన్ ఐడీ నెం. 106422555 అని, మృతి చెందిన వెంటనే డెత్ సర్టిఫికెట్, ఇతర ధ్రువపత్రాలు గ్రామ సచివాలయంలో అందజేశామని, అయినా అధికారులు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో పేరు తొలగించకుండా ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో తన భర్త పేరు తొలగించి, స్పౌజ్ పెన్షన్ మంజూరు చెయ్యాలని సరోజిని కోరారు.

స్పౌజ్ పెన్షన్ మంజూరు చేయరూ..



భర్త పెన్షన్ కార్డును చూపుతున్న వరలక్ష్మి

ముసునూరు: స్పౌజ్ పెన్షన్‌ను మంజూరు చేయాలని ప్రభుత్వం, అధికారులను వృద్ధురా లు వేడుకుంటోంది. మండలంలోని గోగులంపాడుకు చెందిన కొప్పుల వరలక్ష్మి భర్త వెంకటేశ్వరరావుకు వృద్ధాప్య పెన్షన్ లబ్ధిదారు. అయితే రెండేళ్ల క్రితం అతను చనిపోయాడు. గత ప్రభుత్వంలో వరలక్ష్మికి కొత్త పెన్షన్ రాలేదు. కూటమి ప్రభుత్వం భర్త పెన్షన్ తీసుకుంటూ చనిపోతే భార్యకు స్పౌజ్ పెన్షన్‌ను ఇచ్చే అవకాశం కల్పించినా నిబంధనల కారణంగా ఈమెకు పెన్షన్ మంజూరు కాలేదు. కూలి పనులకు కూడా వెళ్ళలేని దయనీయ స్థితిలో ఉన్నానని, పూట గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాని వృద్ధురాలు కన్నీటి పర్యంతమైంది. అధికారులు స్పౌజ్ పెన్షన్‌ను మంజూరు చేయాలని సోమవారం ఆమె విజ్ఞప్తి చేసింది.



దాత ఎన్నారై లెనిన్, నళిని దంపతులను సత్కరిస్తున్న గ్రామస్థులు

దాతలకు ఘన సత్కారం

కలిదిండి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో కోటి రూపాయలతో శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు చేసిన దాత, ఎన్నారై దొంతబోయిన లెనిన్, నళిని దంపతులను గ్రామస్థులు సోమవారం ఘనంగా సత్కరించారు. జన్మభూమి స్ఫూర్తితో సొంత గ్రామానికి అభివృద్ధి పనులు చేయటం అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఇదే స్ఫూర్తిలో గ్రామానికి చెందిన పలువురు ఎన్ఆర్ఐలు, శ్రీమంతులు ముందుకు రావాలన్నారు. మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రేటి శ్రీహరి, రిటైర్డు సబ్ రిజిస్ట్రారు లంకా వెంకటేశ్వరరావు, న్యాయవాది ఆత్రేయ బాబు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, బోయిన గోవింద్, భట్రాజు ఏసుబాబు, జాన్ రాజ్ పాల్గొన్నారు.




పారిశుధ్య కార్మికుల నూతన కమిటీ ఎన్నిక

నూజివీడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎం.విజయ్ ఎన్నికయ్యారు. నూజివీడు అమర్‌భవన్‌లో ఏఐటీయూసీ అనుబంధ పారిశుధ్య కార్మికుల సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చలసాని వెంకట రామారావు, కార్యదర్శిగా నందా, సహాయ కార్యదర్శిగా కనకదుర్గ, ఉపాధ్యక్షులుగా ఎస్.హనుమంతరావు, ట్రెజరర్‌గా శ్రీనుతో పాటు పదిమంది కమిటీని ఎన్నుకున్నారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఇందుపల్లి సత్యప్రకాష్, ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పీఎంజేజేబీవైని సద్వినియోగం చేసుకోండి

చాట్రాయి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలకు ఆర్థికభరోసా అందించాలని చాట్రాయి ఎస్‌బీఐ మేనేజర్ కిరణ్‌కుమార్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పథకం కింద ఖాతాదారు ఏడాదికి కేవలం రూ. 436 చెల్లించి ప్రమాద బీమా చేయించుకుంటే, దురదృష్టవశాత్తు పాలసీదారు చనిపోతే కుటుంబానికి రూ. 2 లక్షలు లభిస్తుందన్నారు. ఈ పథకం లబ్ధిదారులు నలుగురు చనిపోగా వీరి కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున బీమా చెల్లించామన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475



మొల్లంకలో నీటి మట్టం తగ్గిన తాగునీటి చెరువు

సాగు, తాగు నీరేదీ?

సీబీ, పోల్‌రాజ్ కెనాల్స్‌కు నీటి విడుదలకు రైతుల వినతి

కలిదిండి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీబీ కెనాల్, పోల్‌రాజ్ కెనాల్‌కు సాగు, తాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. కోరుకొల్లు లాకుల నుంచి దిగువన ఉన్న గ్రామాలకు సీబీ కెనాల్ నుంచి తగినంత నీరు సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నారు. వెదజల్లిన వరి పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయని వాపోతున్నారు. కొండంగి, మట్టగుంట గ్రామాల్లో తాగునీటి చెరువులను ఇంత వరకు పూర్తిగా నింపలేదు. చేపల చెరువుల్లో నీటి మట్టం తగ్గి ఎండ వేడికి చేపలు చనిపోతున్నాయని వాపోతున్నారు. లంక గ్రామాల్లో తాగునీటి చెరువుల్లో నీటి మట్టాలు తగ్గాయి. ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా జలాలను సముద్రంలోకి వదులుతున్నప్పటికీ కలిదిండి మండలానికి తాగు, సాగునీరు చేరకపోవటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోల్‌రాజ్ కెనాల్‌కు నీరు సరఫరా కాకపోవటంతో ఆరుతెగలపాడు, కొండూరు, చినతాడినాడ, తాడినాడ, కాళ్లపాలెం గ్రామాల రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. గుడ్లవల్లేరు లాకుల వద్ద సీబీ కెనాల్‌కు 720 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉండగా, కేవలం 300 క్యూసెక్కుల నీరు మాత్రమే సరఫరా చేయటంతో దిగువకు నీరు రావటం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం 500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తేనే శివారు గ్రామాలకు సాగు, తాగునీరు చేరుతుందని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సీబీ, పోల్ రాజ్ కెనాల్‌కు సాగు, తాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



సెల్‌ఫోన్లను ఐసీడీఎస్ అధికార్లకు తిరిగి ఇచ్చేస్తున్న ముదినేపల్లి అంగన్‌వాడీ కార్యకర్తలు

పనిచేయని ఫోన్లు మాకొద్దు

ఐసీడీఎస్ అధికారులకు ఫోన్లు తిరిగి ఇచ్చేసిన అంగన్వాడీ కార్యకర్తలు

ముదినేపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యాప్‌లు పని చేయడం లేదంటూ ముదినేపల్లి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ఐసీడీఎస్ అధికార్లకు సోమవారం తిరిగి అప్పగించేశారు. మండలంలోని 90 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లను ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సుందరమ్మకు ఇచ్చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన వివరాల నమోదు, కార్యకర్తల, పిల్లల ముఖ ఆధారిత హాజరు, కేంద్రాల్లోని వివిధ వస్తువుల స్టాకు వివరాల నమోదు, పిల్లల మొత్తం హాజరు లాంటి వివిధ అంశాల యాప్‌ల్లో అప్‌లోడ్ చేయాల్సి ఉండగా, ఏ ఒక్క యాప్ సెల్‌ఫోన్లలో పనిచేయకపోవడంతో విసు గెత్తిన అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ఫోన్లను తమ సెక్టార్ సూపర్‌వైజర్లకు అప్పగించారు. పని చేయని ఫోన్లతో ఇబ్బందులు పడుతున్నామని, అందుకే తిరిగి ఇచ్చేశామని యూనియన్ నాయకులు తెలిపారు.

కైకలూరు/మండవల్లి: అంగన్వాడీలకు ప్రభుత్వం కేటాయించిన ఫోన్లు సరిగా పనిచేయకపోవడం, నెట్‌వర్క్ సమస్యలతో తిరిగి ఇచ్చేస్తున్నామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. సోమవారం కైకలూరు ప్రాజెక్టు కార్యాల యం పరిధిలోని కార్యకర్తలు సెల్‌ఫోన్‌లను ఆయా సూపర్‌వైజర్లుకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఫోన్లు నెమ్మదిగా పనిచేయడం, నెట్‌వర్క్ సరిగా లేక పోవడంతో యాప్‌లో వివరాలు నమోదు అసాధ్యంగా మారిందన్నారు. ఇది కార్యకర్తలపై పని భారాన్ని పెంచుతోందన్నారు. ఇందుకు నిరసనగా పనిచేయని ఫోన్లను తిరిగి ఇచ్చేశామన్నారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. బుధవారం నుంచి కేవలం రికార్డు వర్క్ మాత్రమే చేస్తామని ప్రాజెక్ట్ యూనియన్ నాయకులు సుజాత, చెల్లమ్మ, మీనమ్మ, ఝాన్సీ, అబీదా బేగం, రమాదేవి, మీనాక్షి, విజయలక్ష్మి, పద్మావతి, రిబ్కా తదితరులు తెలిపారు.



పుల్లవ డ్రెయిన్లో కిక్కిస తొలగింపు పనులను పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ వాసురాజు

పుల్లవ డ్రెయిన్ అభివృద్ధి

కైకలూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో రహదారులు ముంపునకు గురికాకుండా ఉండాలని పుల్లవ డ్రెయిన్ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు అన్నారు. సోమవారం కైకలూరు-గోపవరం రోడ్డులోని పుల్లవ డ్రైన్ తవ్వకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే డ్రైన్ 80 శాతం పైగా పూర్తయిందని అక్కడక్కడ ఉన్న కిక్కిస, గుర్రపుడెక్క, తూడు తొలగిస్తున్నామన్నారు. డ్రైన్ పూర్తిగా ఆధునీకరించి వర్షాకాలంలో ముంపు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తవ్వకాలు చేసిన కిక్కిసకర్రను గట్లపై వేసేందుకు అవకాశం లేకపోవడంతో ట్రాక్టర్ల ద్వారా దూర ప్రాంతాలకు తరలిస్తున్నామన్నారు. అలాగే ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సహకారంతో డీసీ పరిధిలోని అన్ని పంట కాలువలు, డ్రెయిన్ల తవ్వకాలు పూర్తిచేసి సాగునీరుకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పలువురు రైతులు పాల్గొన్నారు.



బంగారు కుటుంబాలతో మార్గదర్శి నితిన్ కృష్ణ

సీఎం సంకల్పానికి సహకరిస్తాం

పి-4లో భాగంగా రూ. 10 లక్షలతో పశువులు, వస్తువులు అందించిన మార్గదర్శి నితిన్ కృష్ణ

ఆగిరిపల్లి, ఆగస్టు 4, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికం లేని సమాజ స్థాపనకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పానికి మార్గదర్శులుగా తాము పూర్తిగా సహకరిస్తామని నితిన్ కృష్ణ కనస్ట్రక్షన్స్ అధినేత కొలుసు నితిన్ కృష్ణ అన్నారు. సోమవారం ఆగిరిపల్లిలో విస్తృతంగా పర్యటించి తాను దత్తత తీసుకున్న కుటుంబాలను కలుసుకుని ఆర్థికాభివృద్ధికి వారు కోరుకున్న సుమారు 10 లక్షలు రూపాయిల విలువైన పాడి పశువులు, తోపుడు బళ్ళు, సైకిల్, కుట్టుమిషన్లును మొదటి విడతగా అందజేశారు. నితిన్ కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 కార్యక్రమాన్ని నూజివీడు నియోజకవర్గంలోని ఆగిరిపల్లిలో లాంచనంగా ప్రారంభించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆగిరిపల్లిలో బయోగ్యాస్ పరిశ్రమను స్థాపించి స్థానిక 600 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. బంగారు కుటుంబాలు సొంతంగా వ్యాపారాన్ని ప్రారంభించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు అవసరమైన చేయూతనిస్తామని తెలిపారు. విద్యనభ్యసించిన యువతకు వారికి అభిరుచి కలిగిన రంగంలో నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందించి ఉద్యోగ అవకశాలు కల్పిస్తామన్నారు. జిల్లా పరిషత్ సీఈవో, నియోజకవర్గ ప్రత్యేక అధికారి యం శ్రీహరి, తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్, ఎంపీడీవో బి. భార్గవి తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లిలో తల్లిపాల వారోత్సవాలు

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి

ముదినేపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ముదినేపల్లి, పెయ్యేరు కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతో నిర్వహించిన సమావేశాల్లో సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లి పాలు పిల్లలకు ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి ఊడా పెంచుతుందని, విటమిన్లు సమకూరుతాయని అన్నారు. పిల్లలకు పాలిస్తే తల్లులు కూడా ఆరోగ్యంగా ఉంటారని విజయలక్ష్మి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పి సరస్వతి, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో సారా స్థావరాలపై దాడులు



పోతనపల్లి ఫారెస్ట్‌లో బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు (డ్రోన్ షాట్)

చాట్రాయి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లి ఫారెస్ట్‌లో సోమవారం సాయంత్రం నూజివీడు రూరల్ సీఐ కె. రామకృష్ణ, చాట్రాయి ఎస్సై డి. రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం సాయంత్రం డ్రోన్ సాయంతో సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సీఐ కె. రామకృష్ణ మాట్లాడుతూ సారా, ఓపెన్ డ్రింకింగ్, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడంలో భాగంగా గ్రామాల్లో డ్రోన్ ఆధారిత నిఘా వ్యవస్థను అమలు చేస్తున్నట్లు చెప్పారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నైరుతి..!

(5వ పేజీ తరువాయి)

నిడమర్రు మైనస్ 60.6, మండవల్లి మైనస్ 26.1, కలిదిండి మైనస్ 1.7, ముదినేపల్లి మైనస్ 23.2, ఏలూరు అర్బన్ మైనస్ 51.6, చింతలపూడి మైనస్ 26.1, లింగపాలెం మైనస్ 41.5, చాట్రాయి మైనస్ 19, ముసునూరు మైనస్ 6.1, నూజివీడు మైనస్ 46.9, ఆగిరిపల్లి మైనస్ 3.7 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

జూన్, జూలై నెలలు కలిపి మొత్తం వర్షపాతం పరిశీలిస్తే జిల్లాలోని 12 మండలాల్లో సాధారణం కన్నా మించి వర్షపాతాలు నమోదు కాగా 16 మండలాల్లో మైనస్ వర్షపాతాలు నమోదయ్యాయి. ఈ రెండు నెలల్లో కలిపి మొత్తం సాధారణ వర్షపాతం 354 మిల్లీ మీటర్లు కాగా 370 మి.మీ వర్షపాతం నమోదైంది. అయితే వర్షం కురిసిన ప్రాంతాల్లో మాత్రమే వర్షం కురుస్తోంది. వర్షం కావాల్సిన ప్రాంతాల్లో వర్షం అంతంతమాత్రంగానే కురుస్తోంది. దీంతో సార్వా సాగులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఏలూరులో వైద్యుల నిర్లక్ష్యం..

- వ్యక్తి మరణించిన 8 గంటల తరువాత ఎమ్మెల్సీ ఇంటిమేషన్
- ఆస్పత్రి ముందు బంధువుల పడిగాపులు

ఏలూరు క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వ్యక్తి జీవితంపై విరక్తి చెంది పురుగుల మందుతాగి తన జీవితాన్ని ముగించుకున్నాడు. అతను మర ణించిన ఎనిమిది గంటల తరువాత పోలీసులకు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమాచారమిచ్చారు. ఎంత నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్నారో ఈ ఘటనే స్పష్టమవుతోంది. భీమవరం సమీపంలోని కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన మాణెం శివ ప్రసాద్(50)కు భార్య , ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శివ ప్రసాద్ ఒక మిక్చర్ బండి వద్ద పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఐదు నెలల క్రితం సైకిల్‌పై నుంచి పడిపోవడంతో అ తడికి ఆపరేషన్ కూడా నిర్వహించారు. కుటుంబాన్ని తన కష్టంతో పోషించాల్సిన వాడిని తానే ఆ కుటుంబానికి బారంగా మారానని కుమిలి పోతూ సోమవారం తెల్లవారుజామున ఇంటి వద్దే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి సోమవారం ఉదయం 11.07 నిమిషాలకు తీసుకువచ్చి ఇఎండి వార్డులో చేర్పించారు. అయితే 20 నిముషాల వ్య వధిలోనే అతను మృతి చెందాడు. సాధారణంగా ఎమ్మెల్సీ కేసుల్లో మరణించిన వెంటనే ఎమ్మెల్సీ ఇంటిమేషన్‌ను ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు అందిస్తారు. అక్కడ పోలీసులు సమాచారాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తారు. వారు వెంటనే ఆసుపత్రికి వచ్చి పంచనామా ని ర్వహించి వైద్యులు చేత పోస్టుమార్టం జరిపించి మృత దేహాన్ని అప్పగిస్తారు. కానీ ప్రసాద్ 11.27 నిముషాలకు మరణిస్తే సోమవారం రాత్రి 7.20 నిమిషాలకు డెత్ ఇంటిమేషన్‌ను ఆసుపత్రి వై ద్యులు, ఔట్‌పోస్టు పోలీసులకు అందించారు. దీంతో ఉదయం నుంచి ఆ కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి వద్దే బిక్కుబిక్కుమంటూ తమ బంధువు మృత దేహం కోసం పడిగాపులుపడుతూనే ఉన్నారు. అక్కడ సిబ్బందిని అడిగితే వారు విసుక్కున్నారని వైద్యులు ఒకరిపై ఒకరు వంతులు వేసుకుని సంతకం పెట్టలేదని చెప్తున్నారు. సోమవారం పోస్టుమార్టం జరగాల్సిన మృత దేహం చివరకు మార్చురీలోనే ఉంది. ఆ కుటుంబ సభ్యులు మృతదేహం ఎప్పుడిస్తారో అంటూ దుఃఖంతో ఆస్పత్రి వద్దే రోదిస్తున్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఎన్నిసార్లు ఆసుపత్రి వైద్యులకు హెచ్చరికలు జారీ చేసినా తాము ఇంతేనంటూ విధులను నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు ఈ సంఘటనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ట్రిపుల్ ఐటీలోకి అక్షయపాత్ర !

(5వ పేజీ తరువాయి)

మెస్‌ల్లో భోజన సదుపాయాలు చేసేందుకు ప్రస్తుతం ఉన్న కిచెన్లు తమకు పనికి రావని, తమకు అనుగుణంగా కిచెన్‌లను తామే ఏర్పాటు చేసుకుంటామని, అందుకు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఎకరం భూమిని తమకు ఇవ్వాలని అక్షయపాత్ర సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అలా తమకు భూమి ఇస్తే ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.2 కోట్ల వరకు తమకు ఇచ్చేందుకు ఆయా క్యాంపస్‌ల పరిధిలోని ఎంపీలు సిద్ధంగా ఉన్నారని, మిగిలిన మొత్తం తమ సంస్థ బరాయించి, మెస్‌లకు అవసరమైన షెడ్లను, కావాల్సిన పరికరాలను ఏర్పాటు చేసుకుంటామంటూ ప్రభుత్వానికి ప్రతిపాదించినట్టు సమాచారం.

మెప్మాకు మాంసాహారం బాధ్యత

ట్రిపుల్ ఐటీల్లో విద్యార్థులకు మెప్మా ద్వారా మాంసాహారం భోజనం అందించేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఫుడ్ కోర్ట్‌ను మెప్మా పరిధిలో నిర్వహిస్తుండగా, ఇదేవిధంగా నాలుగు క్యాంపస్‌ల లోనూ మాంసాహార భోజనాన్ని మెప్మా ద్వారా అందించేందుకు ముందుకు వస్తున్నట్టు అధికార పార్టీ నేతలు అడుగులు వేస్తున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: సబ్ కలెక్టర్

నూజివీడు టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని, నూజివీడు సబ్‌కలెక్టర్ డి.స్మరణ్‌రాజ్ అన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 23 అర్జీలు దాఖలైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో పాత్రికేయు లు తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. నివేశనా స్థలాలు కేటాయించాలని, పాత్రికేయ కుటుం బాలకు పూర్తిస్థాయి బీమా, వైద్యసేవలు కల్పించాలని కోరారు. సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన వారిలో ఫెడరేషన్ అధ్యక్షులు అబ్బాస్‌ఆలీ, ఆర్.రామ్మోహన్ రావు, రాజేంద్రప్రసాద్, కె.వి.ఎస్ రాజు ఉన్నారు.



స్వయంగా సిల్ట్ తొలగింపు

నూజివీడు టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్‌లలో పూడుకుపోయిన సిల్ట్‌ను తొలగించటంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తున్నారంటూ నూజివీడు పట్టణం అజరయ్యపేటకు చెందిన ప్రత్తిపాటి ప్రసాద్ నిరసన తెలిపాడు. తాను నివసించే ప్రాంతంలో సిల్ట్ తొలగించకపోవడంతో మురుగునీరు నిలిచి దోమలు విపరీతంగా ప్రబలుతున్నాయని, తన సోదరుడికి బోదకాలు కూడా వచ్చిందని, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో తానే స్వయంగా సిల్ట్ తొలగించడంతో పాటు డ్రైనేజి నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఆస్తి పన్ను, ఇతర పన్నులను కట్టించుకోవడంలో చూపుతున్న శ్రద్ధ ప్రజలకు కనీస సౌకర్యాలు అందించటంలో అధికారులు చూపాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

24 గంటల్లోపే ఆచూకీ లభ్యం

ముదినేపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తన భర్త కనిపించడంలేదని భార్య ఫిర్యాదు చేసిన 24 గంటల్లోపే పోలీసులు అతని ఆచూకీ కనుగొని ఇంటికి చేర్చిన సంఘటన ఇది. ఈ నెల 3న మధ్యాహ్నం 2 గంటలకు ఆ గ్రామానికి చెందిన సోమేశ్వరరావు (50) అతని భార్య కలసి మేకలను మేపుకునేందుకు బయటకు వెళ్ళారు. కొద్ది సేపటి తరువాత సోమేశ్వరరావు ఒక్కడే ఇంటికి వెళ్ళిపోయాడు. సాయంత్రం అతని భార్య మేకలను తోలుకుని ఇంటికి తిరిగి వెళ్ళగా భర్త ఇంటి వద్ద లేకపోవడం గమనించి అతని ఆచూకీ కోసం గ్రామంలో వెదికినా కనిపించకపోవడంతో ఆదివారం రాత్రి 11 గంటలకు ఆమె భర్త అదృశ్యంపై ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును పరిశీలించిన ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా సోమవారం ఉదయం సోమేశ్వరరావు ఆచూకీ కోసం ప్రయత్నాలు చేయగా అతను గుడివాడలో పోలీస్ సిబ్బందికి దొరికాడు. వెంటనే అతనిని ముదినేపల్లి తీసుకువచ్చి భార్యకు అప్పగించారు.

చికెన్ సెంటర్‌లో చోరీ

ముసునూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పుచర్ల గ్రామంలోని లహరి చికెట్ సెంటర్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. కిడ్డీ బ్యాంక్, క్యాష్‌బాక్స్‌లోని రూ. 20వేలు నగదును అపహరించుకుపోయినట్లు యాజమాని గరికిముక్కు హనుమంతరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం చోరీ జరిగిన దుకాణాన్ని ముసునూరు పోలీసులు పరిశీలించారు.

పేకాట శిబిరంపై దాడి..

చాట్రాయి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తపూరులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం రాత్రి దాడి చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకొని రూ. 6,150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై డి. రామకృష్ణ తెలిపారు. గ్రామాల్లో జూదం జరుగుతుంటే ఫోన్ నంబరు 94407 96455కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

పారిపోయిన నిందితుడి అరెస్ట్

చాట్రాయి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గతంలో సారా తయారు చేస్తూ నేర స్థలం నుంచి పారిపోయిన మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన కలవకొల్లు రెడ్డయ్యను సోమవారం అరెస్ట్ చేసి తిరువూరు కోర్టులో హాజరుపర్చినట్టు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. సారా తయారీ చేసే వారు, అమ్మకాలు జరిపేవారు, బెల్లం ఊట కలిగిన భూ యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.